Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 129 మేడ్చల్ మల్కాజ్‌గిరి 31 మే 2023 బుధవారం పేజీలు : 4

## నక్సల్స్ చేతిలో అత్యాధునిక గ్రెనేడ్ లాంఛర్లు

దిల్లీ: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దక్షిణ బస్తర్ జిల్లా మారుమూల ప్రాంతాల్లో కొత్తగా ఏర్పాటుచేసిన సీఆర్పీఎఫ్ శిబిరాలపై నక్సలైట్లు అత్యాధునిక గ్రెనేడ్ లాంఛర్లతో దాడికి దిగుతున్నారని అధికారులు వెల్లడించారు. 'బ్యారెల్ గ్రెనేడ్ లాంఛర్లు'గా పిలిచే వీటిని గత ఆర్నెల్లలో దాదాపు 100 – 150 వరకు సీఆర్పీఎఫ్ శిబిరాలపై ప్రయోగించినట్లు తెలిపారు.

వామపక్ష తీవ్రవాద ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఈ దాడులు తరచూ జరుగుతున్నాయి. ఈ దాడుల తీవ్రత రాను రాను పెరుగుతోంది. రాష్ట్రంలోని కంకేర్, రాజ్‌నంద్‌గావ్ జిల్లాల్లో మోహరించిన బీఎస్ఎఫ్, ఐటీబీపీ దళాలపై గతంలో ఈ విధమైన దాడులు జరిగాయి. పాత గ్రెనేడ్ లాంఛర్లు తయారీ లోపాల కారణంగా కొన్ని సందర్భాల్లో పేలేవి కావు. మావోయిస్టులు ఉపయోగిస్తున్న అత్యాధునిక గ్రెనేడ్లపై సెక్యూరిటీ, ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నట్లు అధికారి వెల్లడించారు.

# మొదలైన పార్టీల హడావిడి

## వివిధ కార్యక్రమాలతో జనంలోకి..

## క్షేత్రస్థాయిలో ఎలక్షన్స్ సందడి




రంగారెడ్డి :ఉమ్మడి జిల్లాలో శాసనసభ ఎన్నికల వేడి మొదలైంది. అటు అధికారులు, ఇటు నేతలు ఎన్నికలపై దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో అందుకనుగుణంగా సన్నాహాలు మొదలు పెట్టారు. ఆయా రాజకీయ పార్టీలు జనంతో మమేకమయ్యేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటుండగా, అధికారులు బూత్‌స్థాయిలో చర్యలను ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికలకు గడువు సమీపిస్తుండడంతో ఉమ్మడి జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల సందడి మొదలైంది. అధికార బీఆర్ఎస్ పార్టీతోపాటు ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, ఎంఐఎం పార్టీలు ప్రజల్లోకి వెళ్లడంపై దృష్టిసారించారు. ఇందుకోసం ఎప్పటికప్పుడు సరికొత్త కార్యచరణ రూపొందించుకుంటూ ముందుకు వెళ్తున్నాయి. క్షేత్రస్థాయిలో తన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకుని కార్యక్రమం ఏదైనా పార్టీ పరంగా గుర్తింపు పొందేలా హడావిడి చేస్తున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఎన్నికల వాతావరణం మొదలైంది. పార్టీల పరంగా టికెట్లు ఎవరికి వస్తాయనే విషయం పక్కనబెడితే ప్రజల్లో దూసుకెళ్లేందుకు వ్యూహాలు ప్రతివ్యూహాలతో ముందుకు వెళ్తున్నాయి. గడిచిన నాలుగున్నరేళ్లు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ అధికార బీఆర్ఎస్ పార్టీ అనేక ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోంది. మరోవైపు అధికార పార్టీ వైఫల్యాలను ఎండగడుతూ ప్రతిపక్షాలు ఆందోళనలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నాయి. అయితే ఎన్నికల సన్నద్ధంలో అధికార బీఆర్ఎస్ పార్టీ కొంత ముందంజలో ఉండడం గమనార్హం. అన్ని వనరులు బీఆర్ఎసకు పుష్కలంగా ఉండడంతో అన్ని విధాలా పార్టీని సమాయత్తం చేస్తోంది. అయితే గులాబీలో టికెట్ల పంచాయతీ ప్రతి నియోజకవర్గంలో ఉండడం ఆ పార్టీకి కొంత చికాకులు తప్పడం లేదు. ఒక్కో నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి టిక్కెట్ కోసం ముగ్గురు నలుగురు నేతలు పోటీపడుతున్నారు. ఇక ప్రతిపక్ష పార్టీలు చాపకింద నీరులా ప్రజల్లో పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నాయి. అధికార పార్టీలో అసమ్మతిని తమ వైపు తిప్పుకునేందుకు బీజేపీ, కాంగ్రెసలు పోటీపడుతున్నాయి. క్షేత్రస్థాయిలో తన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకునేందుకు రాజకీయ పార్టీలు సన్నాహాలను మొదలు పెట్టాయి. కార్యక్రమం ఏదైనా పార్టీ పరంగా గుర్తింపు పొందేలా హడావిడి చేస్తున్నారు. పార్టీల పరంగా టికెట్లు ఎవరికి వస్తాయనే విషయం పక్కనబెడితే ప్రజల్లో దూసుకెళ్లేందుకు వ్యూహాలు ప్రతివ్యూహాలతో ముందుకు వెళుతున్నారు.

**ఏదో ఒక కార్యక్రమంతో ప్రజల్లోకి గులాబీ దళం :** ఎన్నికల సన్నద్ధంలో భాగంగా మిగతా పార్టీలతో పోలిస్తే అధికార బీఆర్ఎస్ పార్టీ ముందంజలో ఉంది. పలు కార్యక్రమాలతో కార్యకర్తల్లోనూ, ప్రజల్లోనూ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు ఉంటున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అందే ఆదేశాలకనుగుణంగా నేతలు ఆయా నియోజకవర్గాల్లో కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రతి సమావేశంలో చెబుతున్నారు. అంతేకాక నిత్యం జనాల్లో ఉండేవిధంగా పార్టీపరంగా గులాబీ దళానికి కార్యక్రమాల షెడ్యూల్‌ను ప్రకటిస్తున్నారు. ఆత్మీయ సమ్మేళనాలతో ప్రారంభమైన హడావిడి ఇంకా ఉమ్మడి జిల్లాలో కొనసాగుతుంది. మండల, పట్టణ స్థాయిలో ఈ కార్యక్రమాలను చేపట్టి మంత్రులు, ఎంపీలను, ఇన్‌చార్జీలను పంపించి పరిస్థితులను రాష్ట్ర పార్టీ అంచనాలు వేసింది. వన భోజనాలు ఏర్పాటు చేయించారు. జిల్లాలో తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్‌లో అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తాండూరులో పల్లెపల్లెకు పైలెట్, వాడవాడకు పైలెట్ పేరుతో నెలరోజులపాటు జనం మధ్య ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఉన్నారు. పరిగిలో పల్లెబాట పేరిట ఎమ్మెల్యే మహేషరెడ్డి ఊరూవాడను చుట్టి వచ్చారు. వికారాబాద్‌లో ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ప్రజల్లోకి వెళ్తూ.. రాత్రివేళ పల్లెల్లో బస చేసి మరుసటి రోజు గ్రామంలో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుంటున్నారు. కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ప్రత్యేకంగా కార్యక్రమాలు చేపట్టకపోయినా నిత్యం ఏదో ఒక ప్రోగ్రాంలో భాగంగా నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. పార్టీ అధిష్టానం మేరకు సీఎం కప్ కార్యక్రమంతో యూవతతో మమేకమయ్యారు. మరోవైపు సిట్టింగ్‌లకే టికెట్లు అని గులాబీ బాస్ పలుమార్లు ప్రకటిస్తుండటంతో ఎమ్మెల్యేలు నిత్యం ప్రజల మధ్యన ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు.

**చాపకింద నీరులా బీజేపీ :** బీజేపీ ఉమ్మడి జిల్లాలో చాపకింద నీరులా విస్తరిస్తోంది. ముఖ్యంగా నగర శివారు ప్రాంతాలను టార్గెట్ చేసింది. పార్టీ అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు ఉమ్మడి జిల్లా అంతటా నిత్యం ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజలకు దగ్గరయ్యే యత్నం చేస్తోంది. నియోజకవర్గాల్లో బీజేపీ సంస్థాగతంగా నిర్మాణం చేపడుతుంది. బూత్‌స్థాయి కేంద్రంగా కాషాయం నేతలు కార్యక్రమాలను చేపడుతున్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ప్రజల్లోకి వెళుతున్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రచారం చేస్తున్నారు. కరపత్రాల ద్వారా వివరిస్తున్నారు. ఇప్పటికే కార్నర్, బూత్‌స్థాయి, ప్రత్యేక సమావేశాలు నిర్వహించిన విషయం విధితమే. ప్రజా సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడికి వెళుతూ అధికారుల దృష్టికి తీసుకెళుతున్నారు. ప్రజా సమస్యలు ఎజెండాగా ముందుకు వెళుతున్నారు. ఇప్పటికే యువతను పెద్ద ఎత్తున బీజేపీ ఆకట్టుకోవడం గమనార్హం.

**కర్ణాటక జోష్‌తో కాంగ్రెస్ :** ఉమ్మడి జిల్లాకు సరిహద్దున ఉన్న కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పవనాలు బాగా వీచాయి. దీంతో సరిహద్దున ఉన్న తాండూరు, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నిండింది. సరిహద్దు ప్రాంతాల ఫలితాలు కాంగ్రెసకు అనుకూలంగా రావడంతో ఇక్కడ కూడా అలాంటి విజయం సాధించే అవకాశం ఉందని కాంగ్రెస్ శ్రేణుల్లో భరోసా నింపాయి. దీంతో కాంగ్రెస్ నేతలు దూకుడు పెంచారు. పలు కార్యక్రమాలతో కార్యకర్తలను కార్యోన్ముఖులను చేస్తూ ప్రజల్లోకి వెళుతున్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి పిలుపు మేరకు నాలుగు నియోజకవర్గాల్లో హాత్ సే హాత్ జోడోయాత్ర పేరిట ప్రజల్లోకి వెళ్లి అధికారంలోకి వస్తే చేపట్టే డిక్లరేషన్లను ప్రజలకు వివరిస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే రైతుకు రూ. 2లక్షల రుణమాఫీ, నిరుద్యోగులకు భృతి, నియోజకవర్గ స్థాయిలో ప్రజలకు మేలు చేకూర్చే కార్యక్రమాలను వివరిస్తున్నారు. ఈ కర్ణాటక ఎన్నికలు, డిక్లరేషన్ల ప్రకటన వంటివాటితో క్యాడర్‌లో ఉత్సాహాన్ని నింపాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క పర్యటిస్తున్నారు.

## జీవన్ రెడ్డిపై పోటీ అంటే.. మైసమ్మ ముంగట మేకపోతును కట్టేసినట్టే : ఎమ్మెల్సీ కవిత




మాక్లూర్ : తెలంగాణ ప్రజల సంక్షేమం బీఆర్ఎస్ కార్యకర్తల లక్ష్యం, కర్తవ్యం అని ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. దేశంలో ఇప్పటి వరకు ఎవ్వరూ చేయలేనన్ని మంచి పనులను సీఎం కేసీఆర్ చేసి చూపించారని, జరిగిన అభివృద్ధిని, అందిస్తున్న పథకాల గురించి ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర మంత్రి చామకూర మల్లారెడ్డితో కలిసి కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అద్భుతంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. స్థానిక ఎమ్మెల్యే జీవన్ రెడ్డి గత ఎన్నికల్లో కంటే అధిక మెజారిటీతో వచ్చే ఎన్నికల్లో గెలుస్తారన్న విశ్వాసం ఉందన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో జీవన్ రెడ్డి మీద ఎవరైనా పోటీ చేయాలనుకుంటే మైసమ్మ ముంగట మేకపోతును కట్టేసినట్టే అవుతుందని తెలియజేశారు. కాబట్టి ఇతర పార్టీల నేతలు గెలిచే అవకాశం లేనందుకు ఆశలు వదిలేసుకుంటే మంచిదని సూచించారు. ఒకప్పుడు ఇదేమి పార్టీ అని అవహేళన చేశారని, కానీ ఇప్పుడు అదే గులాబీ పార్టీ ఇంటికి మూడు పథకాలు అందించే స్థాయికి ఎదిగిందన్నారు కవిత. పది మందికి సాయం చేశామంటే ఆ రోజు రాజకీయ నాయకులకు ప్రశాంతంగా నిద్రపడుతుందన్నారు. "మీరు చేసిన త్యాగం ఇవాళ తెలంగాణలో ఇస్తున్నటువంటి ప్రతీ పథకం. ఇవాళ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు చిందించినటువంటి స్వేధం చెరువుల్లో కనిపిస్తున్న మంచినీటి చుక్కలు. బీఆర్ఎస్ కార్యకర్తల త్యాగం ఇవాళ కాళేశ్వరం ప్రాజెక్టు రూపంలో తెలంగాణ మొత్తానికి నీటి కుండలాగా తరతరలాకు ఆదుకునే ప్రాజెక్టు. మనది ఉట్టి రాజకీయ పార్టీ కాదు. ఎంతో కష్టంతో, కోపంతో, ఆవేదనతో , ప్రేమతో పుట్టుకొచ్చిన పార్టీ. ప్రజలను బాగు చేయాలని భావించిన పార్టీ మనది " అని కార్యకర్తలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. గత 10 ఏళ్లలో దేశంలో ఎవ్వరూ చేయనన్ని మంచి పనులు బీఆర్ఎస్ పార్టీ చేసి చూపెట్టిందని స్పష్టం చేశారు. మరింత బాధ్యతగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. మనకు ఇతర రాజకీయ ఆలోచనలు లేవని, ప్రజలకు మంచి చేయాలన్నదే ప్రధాన ఆలోచన అని స్పష్టం చేశారు. తెలంగాణకు బాగుపడాలని కోరుకునేవాళ్లమని కవిత చెప్పారు. రెండు దశాబ్దాల నుంచి ప్రజల్లో ఉన్న నాయకులు ఈ మండలంలో ఉన్నారని కవిత గుర్తు చేశారు. అనేక మంది కార్యకర్తలు, నాయకులు గులాబీ కండువాకు అంకితమయ్యారని కొనియాడారు. తమ పార్టీ విస్తరిస్తోందని, ప్రజలకు మంచి జరగాలన్నది మొదటి ఉద్దేశమని, మనకు పదవులు రావడం అన్నది రెండో ఉద్దేశమని అన్నారు. సీఎం కేసీఆర్ లక్ష్యాన్ని, తెలంగాణ ప్రజల ఆశయాలను, అమరవీరుల త్యాగాలను, జయశంకర్ సార్ స్ఫూర్తిని తీసుకకొని ముందుకెళ్తున్న పార్టీ బీఆర్ఎస్ అని, ఇటువంటి పార్టీలో ప్రతీ ఒక్కరికి అవకాశాలు వస్తాయని, మంచి పదవులు వస్తాయని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. లక్షా 33 వేల మంది బీడీ కార్మికులకు నిజామాబాద్ జిల్లాలో పెన్షన్ అందుతోందని, కాబట్టి ప్రత్యేకించి బీడీ కార్మికుల కోసం ఈఎస్ఐ ఆస్పత్రిని నిర్మించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లా రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ ఆస్పత్రిని నిర్మిస్తే కామారెడ్డి ప్రాంతంలో ఉన్న కార్మికులకు కూడా ఉపయోగపడుతుందని చెప్పారు. భవన నిర్మాణ కార్మికులు నిజామాబాద్ లో పెద్ద సంఖ్యలో ఉంటారని, వారికి బీమా సౌకర్యం కల్పించి ఆదుకోవాలని కోరారు.

తెలంగాణ దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన నూతన నిర్మాణాలను మంత్రి కేటీఆర్ తన ట్విటర్ ఖాతాలో పంచుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి నంది జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన కళాకృతులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.







# తెలంగాణలో రాజకీయ వేడి

## డేంజర్ జోన్లో ఇద్దరు మంత్రులు..

## 25 మంది ఎమ్మెల్యేలు..

హైదరాబాద్ : తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నవేళ రాజకీయ వేడి సెగలు పుట్టిస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఎవరికి టికెట్ వస్తుందా? అనే చర్చ అప్పుడే మొదలైంది. అయితే గతంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ 25 మంది ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఆ తరువాత తన వ్యాఖ్యలు వక్రీకరించారని అన్నారు. కానీ గులాబీ బాస్ నిర్వహించిన పార్టీ సమావేశంలో కొందరు ఎమ్మెల్యేలు పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. దీంతో ఎర్రబెల్లి చేసిన వ్యాఖ్యలు నిజమేనన్న చర్చ సాగింది. అయితే తాజాగా ఇద్దరు మంత్రులు డేంజర్ జోన్లో ఉన్నట్లు హాట్ హాట్ గా టాపిక్ నడిస్తోంది. ఉత్తర తెలంగాణకు చెందిన ఇద్దరు మంత్రులకు వచ్చే ఎన్నికల్లో టికెట్ అనుమానమేనని మరో మంత్రి తన సన్నిహితులకు చెప్పినట్లు సమాచారం. వచ్చే జనవరికి ప్రభుత్వ గడువు తీరినందున తెలంగాణలో మూడు నెలల ముందే ఎన్నికల వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అధికార బీఆర్ఎస్ తో పాటు ప్రతిపక్షాలు ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. అయితే అధికార పార్టీలో మాత్రం టికెట్ కోసం ఆశావహులు రోజురోజుకు పెరిగిపోతున్నారు.సిట్టింగ్ ఎమ్మెల్యేలు మరోసారి టికెట్ కోసం అధినేత మెప్పుకోసం సెగ్మెంట్లలో జోరుగా పర్యటిస్తున్నారు. ఇప్పటి వరకు టికెట్ దక్కనివారు ఈ సారైనా టికెట్ దక్కించుకోవాలని తీవ్ర ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఈ తరుణంలో ఇద్దరి మంత్రులపై కేసీఆర్ కు తీవ్ర వ్యతిరేకత ఉందని మరో మంత్రి తన సన్నిహితుల ద్వారా వాపోయినట్లు తెలుస్తోంది. ఉత్తర తెలంగాణకు చెందిన ఒకరు 2004 నుంచి వరుసగా గెలుస్తూ వస్తున్నారు. మరొకరు 2009 నుంచి ఇప్పటి వరకు ఓడిపోలేదు. దీంతో ఆయా నియోజకవర్గాల్లోని ప్రజలు ఈసారి ప్రతిపక్ష అభ్యర్థిని గెలిపించేందుకు రెడీ అవుతున్నారట. రహస్యంగా నిర్వహించిన ఓ సర్వే ద్వారా కేసీఆర్ ఈవిషయాన్ని గ్రహించినట్లు తెలుస్తోంది. ఈ సమాచార నేపథ్యంలో కేసీఆర్ ఆ రెండు నియోజకవర్గాల్లో సిట్టింగులకు కాకుండా కొత్తవారికి టికెట్ ఇవ్వనున్నట్లు తెలుస్తోందని చెప్పారు. ఇతర నియోజకవర్గంలో బీజేపీకి చెందిన బలమైన అభ్యర్థులను పార్టీలో చేర్పించుకొని వారికి టికెట్ ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

దీంతో ఆ రెండు నియోజకవర్గాలు బీజేపీకి అవకాశం ఇవ్వకుండా కేసీఆర్ జాగ్రత్తపడుతున్నాడట. ఈ విషయం లీక్ కావడంతో ఉత్తర తెలంగాణకు చెందిన మంత్రుల్లో గుబులు పట్టుకుంది. ఆ ఇద్దరు మంత్రులు ఎవరా? అని ఆరా తీస్తున్నారు. అయితే ఎన్నికల సమయం నాటికి ఎవరా అని తేలిపోనుందని పార్టీ నాయకులు గుసగుసలు పెట్టుకుంటున్నారు. ఇదిలా ఉండగా గతంలో ఎర్రబెల్లి 25 మంది ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉందని చేసిన వ్యాఖ్యలపై కూడా తీవ్ర చర్చ సాగుతోంది. అందులో తమ పేరు ఉందా? అని చాలా మంది ఎమ్మెల్యేలు ఎంక్వైరీలు పెట్టినట్లు సమాచారం.

# సంపాదకీయం

## స్టార్టప్ లకు గడ్డుకాలం..

### ఇక ఆవిష్కరణలకు చెక్ యేనా?

కరోనా మహమ్మారి ధాటికి ఉద్యోగ ఉపాధి కరువైంది. ఇక దాని వల్ల వచ్చిన ఆర్థికమాంద్యంతో అంతా అతలాకుతల మైంది. ఆర్థిక మాంద్యం భయాలతో స్టార్టప్ సంస్థలు కుదేలవుతున్నాయి. నిధుల కొరతతో ఈ కంపెనీలు ఇప్పుడు నేలచూపు చూస్తున్నాయి. దీంతో నిర్వహణ భారాన్ని తగ్గించుకునే దిశగా చర్యలు చేపడుతు న్నాయి. అందులో భాగంగానే ఇప్పటికే పలు కంపెనీలు ఉద్యోగుల తొలగింపు ప్రక్రి యకు శ్రీకారం చుట్టాయి. ఈ ఏడాది మొ త్తంగా భారత్ లో స్టార్టప్ సంస్థలు 60వేల మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ఓ ప్రముఖ నివేదిక అంచనావేసింది. ఇప్పటికే పలువురు పలు ప్రముఖ స్టార్టప్ సంస్థలు దాదాపు 12వేల మంది ఉద్యోగులను ఇంటిదారి చూపించాయి. దీంతో ఉద్యోగు లు తమ ఉద్యోగాలను పెద్ద ఎత్తున కోల్పో తున్నారు. కరోనా తర్వాత అందరి పనివి ధానం మారింది. వర్క్ ఫ్రం హోం.. లెర్నింగ్ ఫ్రం హోం సంస్కృతితోపాటు ఆన్ లైన్ సేవలందించే సంస్థలు స్టార్టప్ సంస్థలు పుట్టుకొచ్చాయి. గడిచిన కరోనా కాలంలో ని రెండేళ్లలో అంతా ఆన్ లైన్ ఉద్యోగాలే నడిచాయి. ఇప్పుడిప్పుడే ఉద్యోగులు ఆఫీ సుల బాటపడుతున్నాయి. మళ్లీ కేసులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఐటీ సంస్థలు మొదలు అన్ని రకాల పరిశ్ర మలు డిజిటలైజేషన్ కు ప్రాధాన్యం ఇస్తారని వార్తలొచ్చాయి. కానీ ఉక్రెయిన్ పై రష్యా యుద్ధం పరిస్థితులను మార్చేసింది. వివిధ వస్తువుల ధరలు భారీగా పెరిగిపోవడంతో కీలక వడ్డీ రేట్లుసైతం పెరిగాయి. దీంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆర్థిక మాంద్యం కోరల్లో చిక్కుకుపోయింది. ఫండ్స్ కొరతతో భారత్ లో స్టార్టప్ లు ఇప్పుడు నేలచూపులు చూస్తున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక తిరోగమన పరిస్థితులు వీటికి భారంగా మారాయి. పెట్టుబడులకు ఎవ రూ ఆసక్తి చూపకపోవడంతో స్టార్టప్ ల ఆశలు ఆవిరి అవుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ మధ్య స్టార్టప్ లలో పెట్టుబ డులు 40శాతం క్షీణించాయి. దేశీయ స్టార్టప్ ఎకోసిస్టమ్ తిరిగి కోలుకోవడానికి 12-15 నెలల సమయం పడుతుందంటు న్నారు ఆర్థిక నిపుణులు. ఆర్థిక మాంద్యం దెబ్బకు అమెరికాలో 22వేల మంది ఐటీ నిపుణుల ఉద్యోగాలు గల్లంతయ్యాయి. ఈ మాంద్యం ఎఫెక్ట్ అగ్రరాజ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. భారత్ లోని స్టార్టప్ సంస్థల్లో పనిచేస్తున్న 12 వేల మంది ఐటీ నిపుణులు కూడా నిరుద్యోగులయ్యారు. కరోనా మహమ్మారి ఉధృతి వేళ లబ్ధి పొం దిన స్టార్టప్ సంస్థలు ఇప్పుడు వాటి విలువ విషయంలో ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. నిరుత్సాహ పూరిత వాతావరణంలో కొత్తగా నిధులు సమకూర్చుకోవడంలో స్టార్టప్ లు ఇబ్బందులు పాలవుతున్నాయి. అందుకే భారీగా ఉద్యోగాలను కోల్పోతున్నారు.

## ఇక పంచాయతీకో పశుమిత్ర



ఆదిలాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం తర్వాత రెండో ప్రధాన ఉపాధి పశుపోషణ. పశుసంపద అభివృద్ధి కోసం ప్రభుత్వం మహిళా సంఘాలకు కోట్ల రూపాయల రుణం అందిస్తోంది. కానీ చాలాగ్రామాల్లో పశువైద్యం అందుబాటులో లేదు. కేవలం మండల కేంద్రాల్లోనే పశు వైద్యశాలలు ఉన్నాయి. చాలాచోట్ల సీజనల్ వ్యాధులు ప్రబలి పదుల సంఖ్యలో పశువులు మృత్యువాత పడుతుంటాయి. ప్రభుత్వం ఈ పరిస్థితి నివారించేందుకు ప్రతి గ్రామ పంచాయతీకి ఒక పశు మిత్రను ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఇందుకోసం తెలంగాణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రణాళిక సిద్ధం చేసింది. క్షేత్ర స్థాయిలో ప్రాథమిక పశువైద్యం అందించాలన్నదే ఈ పథకం లక్ష్యం. కేంద్ర జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్( ఎన్ ఆర్ ఎల్ఎం) నిధులతో సెర్ప్ సంస్థ ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది.

మోడల్ గ్రామాల ఫలితంతోనే

రెండేళ్ల క్రితం ప్రతి మండలం నుంచి రెండు లేదా మూడు గ్రామాల్లో పశుమిత్రలుగా మహిళలను ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో మంచి ఫలితాలు వచ్చాయి. క్షేత్రస్థాయిలో పశువైద్యం అందించడానికి మహిళలు ముందుకు రావడంతో పాటు స్వయం ఉపాధి పొందుతున్నారు. ఇది విజయవంతం కావడంతో ప్రస్తుతం ప్రతి పంచాయతీలో ఒకరిని నియమించడానికి ప్రణాళిక తయారు చేశారు. ఇప్పటికే పలు గ్రామాల నుంచి ప్రతిపాదనలు పంపించారు.

ఎంపిక విధానం ఇలా..

ఎంపికచేసే మహిళ స్వయం సహాయక సంఘం సభ్యురాలై ఉండాలి. కనీసం పదో తరగతి చదివి ఉండాలి. ఎలాంటి వేతనం ఉండదు. కేవలం స్వయం ఉపాధి మాత్రమే. స్థానిక గ్రామ సంఘంలో ఎంపిక చేసిన తర్వాత 15 రోజుల పాటు హైదరాబాద్‌లో శిక్షణ ఇస్తారు. అనంతరం మండల కేంద్రంలోని పశువైద్యాధికారికి అనుసంధానించి మరో నెల రోజుల పాటు క్షేత్రస్థాయిలో శిక్షణ అందిస్తారు. అనంతరం ప్రత్యేక చికిత్స కిట్టును ఇస్తారు. అవసరాన్ని బట్టి బ్యాంకు నుంచి రుణాన్ని అందిస్తారు.

గ్రామాల్లో ఇలా పని చేయాలి..

ఇది కేవలం స్వయం ఉపాధి మాత్రమే. వారు ఎంపిక చేసిన గ్రామ పంచాయతీలో పని చేయాలి. ప్రాథమిక చికిత్స అందించి సేవా రుసుం తీసుకోవాలి. వీరు ప్రభుత్వ పశువైద్యాధికారితో అనుసంధానంగా ఉ ండాలి. ప్రభుత్వం ఎలాంటి వాక్సినేషన్ చేసినా, ప్రత్యేక శిబిరాలలో పశుమిత్రలు పాల్గొనాలి. వ్యాక్సినేషన్ చేస్తే ప్రభుత్వం కూడా కొంత రుసుం ఇస్తుంది. ముఖ్యంగా మహిళా సంఘం సభ్యురాలు కావడంతో గ్రామంలో ఉన్న అన్ని సంఘాల సభ్యులతో లింకు ఉంటుంది. ప్రతి సంఘం పశుమిత్ర వైద్య సేవలను విధిగా వినియోగించుకోవాలి. ఇలా పని చేయడంతో ఒకరికి ఉపాధి పది మందికి వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

ఉమ్మడి జిల్లాలో కావాల్సిన పశుమిత్రల గ్రామాల వివరాలు..

జిల్లాలవారీగా ఎంపిక చేసే పంచాయతీల సంఖ్య

ఆదిలాబాద్: 364 నిర్మల్: 314 కుమరంభీం: 335 మంచిర్యాల: 283

పశువైద్యం అందుబాటులోకి తేవడమే లక్ష్యం: శేషాద్రి, పీడీ, డీఆర్‌డీఓ

గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్యం అందుబాటులోకి తీసుకరావడమే ప్రభుత్వ లక్ష్యం. చాలాగ్రామాల్లో రైతులు ప్రాథమిక చికిత్స కోసం కాలినడకన మండల కేంద్రం వరకు పశువులను తీసుకొస్తుంటారు. అలాంటి సమస్యను దూరం చేయడం కోసమే తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఈ వ్యవస్థను అమలు చేస్తుంది. గతంలో ఏర్పాటు చేసిన చాలా మంది పశు మిత్రలు స్వయం ఉపాధి పొందుతున్నారు.

## వైద్యం మెరుగు.. పారిశుద్ధ్యం కరవు



మంచిర్యాల : గోదావరి ఉగ్రరూపం, పొంగిపొర్లిన వాగులతో జిల్లాకేంద్రంలోని పరిసర ప్రాంతాలన్నీ జలమయమ య్యాయి. ముఖ్యంగా మంచిర్యాల పట్టణానికి వరదలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ప్రధాన కాలనీలైన రాంనగర్, ఎల్ఐసీ కాలనీ, గణేష్‌నగర్, ఎన్టీఆర్ నగర్‌లోని నివాసితులు కోలుకోవాలంటే కొన్ని ఏళ్లు పట్టే పరిస్థితి ఏర్పడింది. వరదలు వచ్చి వెళ్లిన చోట పారిశుద్ధ్య లోపం తీవ్రంగా కనిపిస్తోంది. ఇప్పటికే బురదమయమైన నివాసాలను శు భ్రం చేసుకునేందుకు యజమానులు తల్లడిల్లుతుంటే కాలనీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడంలో పురపాలిక నిర్లక్ష్యం చేస్తోంది. వ్యాధి బారినపడిన తర్వాత చికిత్స అందించేందుకు వైద్యారోగ్యశాఖ సిద్ధంగా ఉన్నా వీటిని సోకకుండా చేయాల్సిన బాధ్యతను నిర్వర్తించడంలో పురపాలిక వెనుకబడిపోయింది.

వ్యాధుల నివారణ చర్యలపై పురపాలిక నిర్లక్ష్యం

వర్షాలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్న సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవడంలో పురపాలక సంఘం అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తున్నారు. నివాస గృహాల మధ్య గల ఖాళీ స్థలాలు, మురుగు కాలువల్లో దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇప్పటికీ క్రిమి కీటకాల నివారణకు వీధుల్లో బ్లీచింగ్ పౌడర్, రసాయన మందులు చల్లలేదు. ఫాగింగ్ చేయలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు నీటి మునిగాయి. ప్రస్తుతం అక్కడ పరిశుభ్రత పనులు చేస్తున్నారు. పట్టణంలోని 36 వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేయడానికి 307 మంది కార్మికులు ఉన్నారు. ఒక్కొక్క వార్డుకు ఆరు నుంచి పది మందిని కేటాయించారు. వీరు రోజు వెలుబడే చెత్తను తొలగించడానికే సరిపోతున్నారు. పట్టణంలో వరదనీరు, మురుగునీరు నిలిచిన చోట ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నా పట్టించుకోవడం లేదు. వీటి నివారణకు వీధుల్లో చల్లడానికి బ్లీచింగ్ పౌడర్, రసాయన మందులు కూడా పురపాలక సంఘంలో అరకొరగానే ఉన్నాయి. ప్రస్తుతం 25 కిలోలవి 130 బ్లీచింగ్ పౌడర్ సంచులు, 50 కిలోలవి 220 సున్నం సంచులు ఉన్నాయి. ఇవి వరద బాధిత కాలనీల్లో చల్లడానికే సరిపోవు. మిగతా వార్డుల్లో వ్యాధుల నివారణకు రసాయన మందులు చల్లించడం ప్రశ్నార్థకంగా మారింది.

వరదలతో వచ్చిన చెత్త అంతా ఇంతా కాదు. దీనిని శుభ్రం చేసేందుకు పట్టణ పారిశుద్ధ్య సిబ్బంది ఏ మాత్రం సరిపోవడంలేదు. అయినా అధికారులు ప్రత్యామ్నాయం చేయడంలేదు. జిల్లాలో ఏడు పురపాలికలు ఉన్నాయి.. ఈ కష్టకాలంలో ఆయా పట్టణాల నుంచి సిబ్బందిని తాత్కాలికంగా జిల్లా కేంద్రంలోని వరద ప్రాంతాల్లో విధులను కేటాయిస్తే పనులు కాస్త వేగంగా జరిగేవి.

వైద్యారోగ్యశాఖ ముందస్తు చర్యలు..వైద్యారోగ్యశాఖ వర్షాలు మొదలైనప్పటి నుంచే చర్యలు ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా సిబ్బందికి సెలవులను రద్దు చేసింది. ఆరోగ్యకేంద్రాల్లో తగిన మందుల ను అందుబాటులో ఉంచింది. ముంపు ప్రాంతాల్లో వైద్యశిబిరా లు ఏర్పాటు చేసి కొనసాగిస్తూనే ఉంది. ఒక్కో శిబిరానికి వైద్యుడితోపాటు ఏఎన్ఎం, ఇద్దరు ఆశా కార్యకర్తలను కేటాయించి తగినన్ని మందులు ఉండేలా చూసుకుంది. జ్వరాల తీవ్రత జిల్లాలో లేదని, వరదలతో వచ్చే వ్యాధుల నియంత్రణకు సిద్ధంగా ఉన్నామని వైద్యాధికారి సుబ్బారాయుడు తెలిపారు.

## ఉప్పొంగిన గోదారి


భద్రాచలం : వామ్మో జులై అనిపించింది. ఈ శతాబ్దపు వరదల చరిత్రలో ఇదే గరిష్ఠం.. ఎక్కడ చూసినా భీతావహ వాతావరణం కనిపిస్తోంది. ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని బతికినప్పటికీ జీవితాంతం శ్రమించి సంపాదించిందంతా నీటిపాలు కావడంతో గోదావరి వరద బాధితులు మౌనంగా రోదిస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం అందిస్తున్నప్పటికీ చేసేందుకు పని కరవైంది. చేతిలో చిల్లిగవ్వ లేదని వాపోతున్నారు. పాడైన సామగ్రిని బాగు చేయించేందుకు పైసా లేకపోవడంతో కుమిలిపోతున్నారు. భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం, పినపాక, బూర్గంపాడు, మణుగూరు, అశ్వాపురం మండలాల్లో ఈ దుస్థితికి కారణం వరద బీభత్సమే. కోలుకునేందుకు ఎంతకాలం పడుతుందో చెప్పలేమని, సర్వే బృందాలు నష్టం అంచనాలను పారదర్శకంగా చేపట్టాలని వేడుకుంటున్నారు.

లి సుభాష్‌నగర్ కాలనీకి చెందిన ఓ వ్యాపారి తన సామగ్రిని గోదాములోనే ఉంచారు. నీళ్లు తగ్గిన తర్వాత చూస్తే నష్టం రూ.లక్షల్లోనే ఉందని వివరిస్తున్నారు.

లి తోపుడు బండి నడిపి కుటుంబాన్ని పోషించే శ్రీను ఇంట్లో కొంత నగదు దాచుకోగా ఇది నీటిలో కొట్టుకుపోయింది. ప్రభుత్వం అందించే రూ.10 వేలను స్వాగతిస్తూనే దీన్ని పెంచాలని కోరుతున్నారు.

బాధితుల్లో అయోమయం

గోదావరీ పరీవాహక ప్రాంతాల్లో మంగళవారం తక్షణ పరిహారం సర్వే చేపట్టారు. ఐటీడీఏ పీవో, ఆర్డీవోలు, ఇతర ఉన్నతాధికారులు



మండల సిబ్బందికి సర్వే నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కాగా సర్వే బృందాలు నిబంధనల ప్రకారం అంటూ కొంతమంది పేర్లను నమోదు చేయడం లేదు. భద్రాచలం సుభాష్‌నగర్ కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తుల గృహాలు మునిగినప్పటికీ వీరు పునరావాసానికి రాకుండా తెలిసిన వారి ఇంటికి వెళ్లారు. ఇలాంటి కొన్ని పేర్లను జాబితాలో పొందుపర్చలేదు. ఇదేమిటని అడిగితే మరో టీం ఇంటికి వస్తుంది అప్పుడు రాస్తారులే అని చెప్పడంతో అయోమయానికి గురవుతున్నారు. అద్దె ఇళ్లలో ఉన్నవారికి భరోసా రావడం లేదు. ఎక్కువ చోట్ల ఈ సమస్య ఉంది. రేషన్ కార్డు లేదన్న సాకుతో తనను బాధితుడిగా గుర్తించడం లేదని కొత్త కాలనీకి చెందిన వ్యక్తి కలెక్టర్‌కు మొర పెట్టుకున్నారు.

## వ్యాధుల పంజా..

సిరిసిల్ల : వర్షంలేని రోజు లేదు.. వరదలు తగ్గినా.. కలుషిత జలాలతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతూనే ఉన్నారు. వీర్నపల్లికి చెందిన బట్టు సీత అనే మహిళ ఇటీవల జ్వరం, విరేచనాలతో చికిత్స పొందుతూ మృతిచెందింది. వర్షాల కారణంగా నీటి వనరుల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. ఈ కోలై బ్యాక్టీరియా వృద్ధి చెందుతోంది. దీంతో వ్యాధుల ముప్పు పొంచి ఉంది. జిల్లా ఆసుపత్రికి డయేరియా, టైఫాయిడ్, విషజ్వరాల బారినపడి చికిత్సకోసం వస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటిని సరఫరా చేసే పైపులైన్లు పగుళ్లు బారాయి. మిషన్‌భగీరథ, గ్రామీణ నీటిసరఫరా అధికారులు మాత్రం నల్లా నీటిని కాచి, వడపోసుకొని తాగాలని చెబుతున్నారు.

జిల్లాలో మిషన్ భగీరథ పథకం ద్వారా 98శాతం జనాభాకు ఇంటింటికీ సురక్షిత నీటిని అందిస్తున్నట్లు అధికారుల లెక్కలున్నాయి. రాజరాజేశ్వర జలాశయం నుంచి సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల కు నీటిని తీసుకుని శుద్ధిచేస్తున్నారు. నీటి సరఫరాలో పైపులైన్ల లీకేజీలు, ట్యాంకులు శుభ్రం చేయకపోవడంతో అపరిశుభ్ర నీరు సరఫరా జరుగుతోందనే సందేహాలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి. చాలాగ్రామా ల్లో ఇప్పటికీ ఆర్వో నీటినే తాగుతున్నారు. జిల్లాలో తాగునీటి ఆధారంగా వ్యాపించే డయేరియా, టైఫాయిడ్ తదితర కేసులు నమోదవుతున్నాయి. జిల్లా ఆసుపత్రికి జూన్‌లో 350 డయేరియా బాధితులు చేరారు. జులైలో ఇప్పటికే 540 మంది చికిత్స పొందారు. నీళ్ల విరేచనాలతో చాలా మంది చిన్నారులు సైతం చికిత్స పొందుతున్నారు. వీరికి డయేరియానే కారణమని చెబుతున్నారు. జిగట విరేచనాలు, వైరల్ హెపటైటీస్, ఎంటిరిక్ ఫీవర్స్ కలుషిత నీటి ద్వారా వ్యాప్తి చెందే జబ్బులు సైతం నమోదయ్యాయి. ఇక టైఫాయిడ్, మలేరియా, విషజ్వరాల్లో తొలిదశ లక్షణాలు ఉంటే మందులతో నయమవుతోంది. వ్యాధి తీవ్రతను బట్టి ఆసుపత్రిలో ఉంచి వైద్యపరీక్షలతో చికిత్సలు అందిస్తున్నారు.

తాగునీరు సురక్షితమేనా..!

వీర్నపల్లిలో మహిళ మృతికి తాగునీటి కలుషితంతోపాటు సరైన చికిత్స అందకనే అని తెలుస్తోంది. జిల్లాలో మంచినీటి సరఫరాలో నాణ్యతా ప్రమాణాలపై ప్రజల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మిషన్‌భగీరథ ద్వారా మంచినీటి సరఫరా చేస్తుండటంతో ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరంలేదని ఆ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. మరోవైపు జిల్లాలో ప్రజలు అధిక శాతం ప్రైవేటు ఆర్వో ప్లాంటు ద్వారా సరఫరా చేసే శుద్ధజలాలను తాగుతున్నారు. దీని ద్వారా ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందని మిషన్ భగీరథ అధికారులు చెబుతున్నారు. మరోవైపు చాలా గ్రామాల్లో మిషన్‌భగీరథ నీరు అందడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కాచి.. చల్లార్చిన నీరే తాగుతున్నాం..

సిరిపురం లక్ష్మీనారాయణ, రాజీవ్‌నగర్, సిరిసిల్ల

మా ఇంటికి భగీరథ నీటి సరఫరా జరుగుతోంది. వారం రోజుల క్రితం వర్షాలు కురవడంతో తాగునీటిని నిల్వ చేసుకున్నాం. కాచి, చల్లార్చిన నీటినే ఇంటిల్లిపాది తాగుతున్నాం. నాలుగు రోజులుగా జ్వరం, విరేచనాలతో బాధపడుతున్నాను. సూది మందు, మాత్రలకు తగ్గకపోవడంతో ఆసుపత్రిలో చేరి చికిత్సపొందుతున్నా.

బోరు నీటిని వాడుతున్నాం- దిడ్డి వెంకటేశం, పెద్దూరు

మా వీధికి పైపులైను ఉన్నా నీటి సరఫరాలేదు. అందరం బోరు నీటినే వాడుతున్నాం. వారం రోజులుగా చలి జ్వరంతో మొదలైంది. దానికి తోడు విరేచనాలు ఉన్నాయి. నాలుగు రోజుల క్రితం ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నా. ప్రస్తుతానికి కొంత నయమైంది.

అజాగ్రత్త వద్దు- మురళీధర్‌రావు, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకులు

ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. చాలావరకు బయటి ఆహారాలకు దూరంగా ఉండాలి. సురక్షిత తాగునీరు చాలా ముఖ్యం. రోగనిరోధక శక్తిని పెంచే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లను ఎక్కువగా తీసుకోవాలి. జ్వరం, వాంతులు, విరేచనాలు వంటి సమస్యల బారినపడితే.. వెంటనే వైద్యులను సంప్రదించాలి. జాగ్రత్తలతోనే కాలానుగుణ వ్యాధులను అరికట్టవచ్చు.

## కార్మికుల పిల్లలకు.. అందుబాటులో వైద్యవిద్య

రామగుండం : ఈఎస్ఐసీ కార్డుదారుల పిల్లలకు సంస్థ ప్రత్యేక కోటాను కేటాయించింది. నేషనల్ ఎలిజిబిలిటీ అండ్ ఎంట్రెన్స్ టెస్ట్(నీట్) ద్వారా దేశవ్యాప్తంగా విద్యార్థులు వైద్య విద్యలో ప్రవేశాలు పొందుతారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని 2016 తర్వాత ఈఎస్ఐసీ వైద్య కళాశాలల్లో ప్రత్యేక కోటాను కార్మికుల పిల్లలకు కేటాయించారు. సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ వైద్య కళాశాలలో 43 సీట్లు ఈ కోటా కింద మంజూరు చేస్తారు. నీట్ రాసిన ప్రతిభ గల విద్యార్థుల నుంచి ఈఎస్ఐసీ దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. రెండేళ్లుగా దరఖాస్తు చేసుకున్న నలుగురు ఈ కళాశాలలో వైద్య విద్యను అభ్యసిస్తున్నారు.

దరఖాస్తు విధానం..

ఈఎస్ఐసీ కార్డుదారుల పిల్లలు నీట్ పరీక్ష రాసి ఉండాలి. నీట్‌లో



ప్రతిభను బట్టి ఈఎస్ఐసీ కోటాలో కేటాయిస్తారు. ఈఎస్ఐసీ కోటాలో పరిగణించాలంటే వార్డు ఆఫ్ ఐపీ సర్టిఫికెట్ పొందాలి. ఈ సర్టిఫికెట్ కోసం మొదట ఈఎస్ఐసీ వెబ్‌సైట్‌లో విద్యార్థులు తమ పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలి. రెండు ఫొటోలు, ఈఎస్ఐ కార్డు ప్రతి, కార్మికుని వేజ్‌స్లిప్, అటెండెన్స్ సర్టిఫికెట్, యజమాని నుంచి ఈపీఎఫ్‌వో పేమెంట్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, నీట్ అడ్మిట్ కార్డు, కుల, ఇంటర్మీడియట్, పుట్టిన తేదీ సర్టిఫికెట్లతో దరఖాస్తులను సమర్పించుకోవచ్చు. వారివారి ఈ-మెయిల్ ఐడీతో దరఖాస్తులను పూరించి ప్రతులను సమీపంలోని ఈఎస్ఐసీ శాఖా కార్యాలయాల్లో సమర్పించాలి. ఈఎస్ఐసీ శాఖా కార్యాలయాల్లో ధ్రువీకరించిన తర్వాత వారిని వైద్య విద్యకు ఈఎస్ఐసీ కోటాలో పరిగణిస్తారు. మెరిట్‌ను బట్టి ఎంబీబీఎస్, బీడీఎస్‌లో ప్రవేశాలు పొందవచ్చు.

26 వరకు గడవు- ఖగేశ్వరరావు, రామగుండం బ్రాంచి మేనేజర్

ఈఎస్ఐసీ కార్డుదారుల పిల్లలు నీట్ రాస్తే మంచి అవకాశం. ఈనెల 26 లోగో దరఖాస్తులు చేసుకోవచ్చు. ఈఎస్ఐసీ వైద్య కళాశాలల్లో ప్రత్యేక కోటా కింద తక్కువ ఫీజు ఉంటుంది. ఈ ప్రాంతంలో 2019-20లో 15 మందికి ఇద్దరికి ప్రవేశాలు లభించాయి. గతేడాది మరో ఇద్దరు ప్రవేశం పొందారు. ఉత్తమ ర్యాంకు వస్తే ఎంబీబీఎస్, బీడీఎస్‌లో ప్రవేశాలు పొందడానికి ఇది మంచి అవకాశం. పూర్తి వివరాలకు ఈఎస్ఐసీ రామగుండం బ్రాంచి కార్యాలయంలో సంప్రదించవచ్చు.

# బోగస్ ఓట్లకు చెక్

జగిత్యాల : త్వరలో ఎన్నికలు జరిగే అయిదు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా సవరణకు ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టింది. మన రాష్ట్రంలోనూ ఎన్నికలు జరగనుండగా ఇంటింటికి వెళ్లి ఓటర్ల పరిశీలన కార్యక్రమం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం హైదరాబాద్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలో ఇప్పటికే ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలు ప్రారంభం కాగా నుంచి జూన్ 23 వరకు ఇంటింటికి వెళ్లి పరిశీలన చేస్తారు. జూన్ 24 నుంచి జులై 24 వరకు పోలింగ్‌స్టేషన్ల గుర్తింపు జులై 25 నుంచి ఆగస్టు 31 వరకు సవరణలు, పరిశీలన, ముసాయిదా జాబితా ప్రచురణ సెప్టెంబర్ 2 నుంచి 31 వరకు అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం, అక్టోబర్ 4న తుది ఓటర్ల జాబితా ప్రచురణ ఉంటుంది.

ఇంటింటికీ అధికారులు..

ఓటర్ల జాబితా సవరణ ఈసారి పకడ్బందీగా చేస్తున్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 6,50,714 మంది ఉండగా అందులో 3,16,019 పురుషులు, 3,34,676 మంది స్త్రీలున్నారు. జగిత్యాల నియోజకవర్గంలో 2,14,996, కోరుట్లలో 2,24,452, ధర్మపురిలో 2,11,261 మంది ఓటర్లున్నారు. డబుల్ ఓట్లను తొలగించేందుకు ఓటర్ల జాబితాను ఆధార్‌కార్డులతో అనుసంధానిస్తున్నారు. బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఇప్పటికే ఆధార్‌కార్డులు సేకరించటమే



కాకుండా రెండు ఓట్లుంటే ఏ ఓటు ఉంచాలనే విషయమై వారి నుంచి దరఖాస్తు తీసుకుని ఒక ఓటును తొలగిస్తున్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలపై దరఖాస్తులు తీసుకోవటమే కాకుండా పలుమార్లు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆరు ఓట్ల కంటే ఎక్కువ ఉన్న నివాసాలతోపాటు 10 మంది కంటే ఎక్కువగా 15 మంది, 20 మంది, 50 మంది, 100 మంది ఈ విధంగా ఎక్కువగా ఓట్లున్న ఇంటి నంబర్లను గుర్తించి ప్రత్యేకంగా విచారణ జరుపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 14,050 ఇళ్లలో ఎక్కువ మంది ఓటర్లున్నట్లు గుర్తించారు. జగిత్యాల నియోజకవర్గంలో 5192, కోరుట్లలో 4865, ధర్మపురిలో 3993 ఇళ్లలో ఎక్కువ ఓట్లు ఉన్నట్లు గుర్తించారు.

అర్హులందరికీ ఓటుహక్కు-ఆర్.డి.మాధురి, ఆర్డీవో

ఓటర్ల జాబితా సవరణకు ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టినప్పటికి జిల్లాలో కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాం. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలకు సంబంధించిన దరఖాస్తులు తీసుకుని పరిష్కరిస్తున్నాం. రాజకీయ పార్టీల ప్రతినిధులతో పలుమార్లు సమావేశాలు ఏర్పాటు చేశాం. ప్రధానంగా బోగస్ ఓట్ల తొలగించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నాం. ఎక్కువ సంఖ్యలో ఓటర్లు ఉన్న ఇళ్లను గుర్తించి అర్హుల ఆధార్‌కార్డులు సేకరించి మిగతా ఓట్లను తొలగిస్తున్నాం. 90 శాతం ఆధార్‌కార్డులను ఓటర్ల జాబితాల్లో అనుసంధానించడం వల్ల డబుల్ ఓట్లు తొలగిపోయాయి. ఎన్నికల సంఘం తీసుకుంటున్న చర్యల మూలంగా ఈసారి అర్హులైన ప్రతిఒక్కరికి ఓటు హక్కు లభిస్తుంది.

# ఖని ఆసుపత్రికి ముస్కాన్ ధ్రువీకరణ

గోదావరిఖని : గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నారులకు అందిస్తున్న మెరుగైన వైద్య సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ మేరకు జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. గోదావరిఖని సార్వజనిక ఆసుపత్రితో పాటు ఖమ్మం, జనగామ, ఉట్నూరు, నల్గొండ, సంగారెడ్డి, అదిలాబాదు ఆసుపత్రుల్లోని చిన్న పిల్లల వైద్య విభాగాలకు 'ముస్కాన్' ధ్రువీకరణ లభించింది. ఇందులో జనగామ, ఉట్నూరు, నల్గొండ, అదిలాబాద్ (రిమ్స్) ఆసుపత్రుల్లో పూర్తి స్థాయిలో ముస్కాన్ ధ్రువీకరణకు ఎంపిక కాగా.. గోదావరిఖని, ఖమ్మం, సంగారెడ్డి ఆసుపత్రులకు కొన్ని షరతులతో కూడిన ధ్రువీకరణ ఇచ్చారు. పన్నెండేళ్లలోపు వయసు గల పిల్లలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోను కార్పొరేట్ తరహా వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో జాతీయ ఆరోగ్య మిషన్ 'ముస్కాన్' పోటీలను ప్రవేశపెట్టింది. మొట్టమొదటి సారిగా ఇందుకోసం ఎంపిక చేసిన రాష్ట్రంలోని ఏడు జిల్లా, బోధన ఆసుపత్రులను పోటీలకు ఎంపిక చేశారు. మార్చి 22వ తేదీ నుంచి మే 4 వరకు 'నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్' ప్రతినిధులు ఆయా ఆసుపత్రుల్లోని చిన్న పిల్లల వైద్య



విభాగాల్లో అందిస్తున్న సేవలు, నిర్వహణ తీరును పరిశీలించి మార్కులు కేటాయించారు. దీని ఆధారంగా 'ముస్కాన్'లో ధ్రువీకరించారు.

చిరునవ్వును అందించడమే లక్ష్యం

అప్పుడే పుట్టిన శిశువు నుంచి 12 ఏళ్లలోపు పిల్లల ముఖాల్లో చిరునవ్వును అందించాలనే లక్ష్యంతో అదే అర్థం వచ్చేలా కేంద్ర ప్రభుత్వం 'ముస్కాన్' పథకాన్ని రూపొందించింది. ఈ పథకంలో పూర్తి స్థాయి ధ్రువీకరణకు ఎంపికైన ఆసుపత్రికి మూడేళ్ల పాటు ఏటా రూ.3 లక్షలు ఆర్థిక ప్రయోజనాలను అందిస్తోంది. షరతులతో కూడిన ధ్రువీకరణకు ఎంపికైన ఆసుపత్రులకు మొదటి సంవత్సరం మాత్రమే రూ.3 లక్షలు ఆర్థిక ప్రయోజనం చెల్లిస్తారు. విధించిన షరతులను పూర్తి చేసుకుంటూ రెండో సంవత్సరం మళ్లీ పోటీలో నిలవాల్సి ఉంటుంది. ఎన్‌క్వాష్ ప్రతినిధులు ఆయా ఆసుపత్రులను క్షేత్రస్థాయిలో పరిశీలించాక కేటాయించే మార్కుల ఆధారంగా 'ముస్కాన్' ధ్రువీకరణ లభించనుంది. ఆధారంగా ఆర్థిక ప్రయోజనాలు మంజూరు కానున్నాయి. కేంద్రం మంజూరు చేసే ఈ ప్రయోజనాల్లో 25 శాతం ఆయా విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఇన్సెంటివ్‌గా చెల్లించి మిగతా 75 శాతం నిధులను చిన్న పిల్లల విభాగంలో మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది.

# పైసా వసూళ్లే.. వారి ఖజానా!



వరంగల్ :'వరంగల్ నగరంలో ఓ ప్రధానోపాధ్యాయుడు రెండేళ్ల కిందట మృతి చెందారు. కొంతకాలానికి ఆయన భార్యకు క్యాన్సర్ సోకింది. హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. అందుకు సంబంధించిన మెడికల్ రీ-ఎంబర్స్‌మెంటు బిల్లులను క్లియర్ చేయాలని ఆమె పిల్లలు, బంధువులు కాళ్లరిగేలా తిరిగినా.. ఖజానా శాఖ అధికారులు కనికరించలేదు. కాసులు ఇవ్వకపోతే పనికాదని తేల్చిచెప్పడంతో అడిగినంత అందజేశారు. ఆరు నెలల కిందటే బిల్లు మంజూరైంది. ఇది జిల్లా ఖజానా శాఖలో అడ్డగోలు వసూళ్ల పర్వానికి ఓ ఉదాహరణ. జిల్లా ఖజానాశాఖలో వసూళ్ల పర్వం హద్దులు దాటుతోంది. ఇక్కడ పనిచేస్తున్న కింది స్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు ముడుపుల దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. రెవెన్యూశాఖలో కన్నా ఇందులోనే మామూళ్లు ఎక్కువనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఉద్యోగుల వేతన బిల్లులు, జనరల్ ప్రావిడెంట్ ఫండ్ పార్ట్ ఫైనల్ బిల్లులు, మెడికల్ రీ-ఎంబర్స్‌మెంట్, ఎల్‌టీసీ, ఐటీ తదితర బిల్లులను క్లియర్ చేయాలంటే ఒక్కో బిల్లుకు ఒక్కో రేటు ఉంటుందని ప్రభుత్వ ఉద్యోగ వర్గాలే చెబుతున్నాయి. ఇళ్లనిర్మాణం, పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం తీసుకునే అడ్వాన్సులకు సంబంధించి ఉద్యోగులు సమర్పించిన బిల్లులను ఖాజానాశాఖలోని అధికారులు పరిశీలించి క్లియర్ చేసి ఈ-కుబేర్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆర్థికశాఖ అనుమతితో బిల్లులు మంజూరవుతాయి. ఖజానాశాఖలో చేతులు తడపకపోతే ఏ బిల్లు పాసయ్యే అవకాశంలేదు.

ఆమె లెక్క వేరు!

జిల్లా ఖజానాశాఖలో విధులు నిర్వర్తిస్తున్న ఓ మహిళా అధికారిణి కనుసన్నల్లోనే వసూళ్ల పర్వం కొనసాగుతుందని బాధిత ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అడిగినంత ఇవ్వకపోతే.. దస్త్రాన్ని పక్కన పడేస్తారని చెబుతున్నారు. ప్రతీ పనికి ఓ పర్సెంటేజీ విధించారని, బిల్లుల స్థాయిని బట్టి రూ.1000 నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు..

ఓ పాఠశాల ఉపాధ్యాయుడు మెడికల్ లీవ్ బిల్లుల క్లెయిమ్ కోసం 2022 నవంబరులో ఖజానాశాఖకు కావాల్సిన అన్ని డాక్యుమెంట్లను సమర్పించారు. నెలరోజులైనా బిల్లుల క్లియరింగ్ ఒక్క అడుగు ముందుకు పడకపోవడంతో.. సహోద్యోగుల సూచనతో ఆమెకు రూ.2 వేలు సమర్పించుకున్నారు.

ఇక్కడ షరా 'మామూలే'..

ప్రభుత్వశాఖల పరిధిలో జరిగే అన్ని అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులకు ఇక్కడ క్లియరెన్స్ తప్పనిసరి కావడంతో.. ఖజానాశాఖ అధికారుల ఆటలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. అభివృద్ధి పనులను చేపట్టిన కాంట్రాక్టర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతిగృహాలకు అద్దెకు భవనాలిచ్చిన యజమానులు.. బిల్లుల క్లియరింగ్‌కు వారికి మంజూరయ్యే నిధులను బట్టి వసూళ్లకు పాల్పడుతున్నారని లబోదిబోమంటున్నారు. క్లియర్ అయిన వేల బిల్లులు నెలల తరబడి ఆర్థికశాఖ ఆమోదం కోసం ఎదురుచూస్తున్నందున.. ఖజానాశాఖలోనూ బిల్లులు ఆలస్యం కావొద్దని ఖజనాశాఖ అధికారులు అడిగినంత ఉద్యోగులు ముట్టజెప్పుతున్నారు.

మచ్చుకు కొన్ని.. వరంగల్ కాశిబుగ్గలోని ఓ ఉపాధ్యాయుడు ఈ ఏడాది జనవరిలో జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ కోసం అన్ని డాక్యుమెంట్లను ఖజానాశాఖలో సమర్పించారు. బిల్లులతో పాటు రూ.1000 చెల్లించారు. ఇచ్చిన డబ్బులు సరిపోకపోవడంతో.. కొన్ని బిల్లులను మిస్‌ప్లేస్ చేశారు. మరికొంత నగదు చెల్లించగా.. బిల్లును 3 నెలల తర్వాత క్లియర్ చేశారు. నగరంలోని ఓ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులకు ఐటీ రిటర్న్ చేసేందుకని ఒక్కొక్కరికీ అయితే రూ.1000 అని.. పాఠశాలలోని ఉపాధ్యాయులందరికీ కలిపి రూ.10 వేలు చెల్లించాల్సిందిగా ఖజానాశాఖ అధికారులు ఆఫర్ ఇచ్చారు. ఈ ఆఫర్ ప్రతి ఏడాది మార్చిలో అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు సుపరిచితమేనని చెబుతారు. ఈ ఏడాది ఫిబ్రవరి ఓ ఉద్యోగి అనారోగ్య సమస్యలతో మృతిచెందారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తక్షణమే లేదా 10 రోజుల్లోపు ఉద్యోగి కుటుంబ సభ్యులకు కర్మకాండలు నిర్వర్తించేందుకు రూ.20 వేలు చెల్లించాలి. ఆ కర్మకాండలకు అవసరమైన డబ్బులనూ 3 నెలలు గడిచినా.. బాధిత కుటుంబానికి చెల్లించకపోవడం అధికారుల అలసత్వానికి నిదర్శనం.

అవినీతిపై ఏసీబీ దాడులు చేయాలి..

కమలాకరరావు, సమాచారహక్కు చట్టం ప్రచార సమితి సలహాదారు

అన్ని ప్రభుత్వశాఖల మాదిరి ఖజానాశాఖలోనూ ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి. డబ్బులు ముట్టనిదే.. ఒక్క బిల్లును అధికారులు క్లియర్‌చేసిన దాఖలాలు లేవు. ఖజానాశాఖ బాధితులు అన్ని ప్రభుత్వశాఖల్లో ఉన్నారు. డబ్బులు ఇవ్వనివారి బిల్లులను పెండింగ్ పెట్టి వారిని మానసికంగా హింసిస్తున్నారు.

# పనులెలా ఉన్నా ముడుపులు ముట్టాల్సిందే..!

వరంగల్ : అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తేనే పది కాలాల పాటు ఫలితాలిస్తాయి. ఇందులో పాలకవర్గానిదే కీలక పాత్ర. వారే కమీషన్లకు ఆశ పడితే పనులెలా జరుగుతాయో అర్థం చేసుకోవచ్చు. అంతా సిండికెట్ అవుతూ ఒక ధరను నిర్ణయించి జేబులు నింపుకొంటున్నారు. పనులెలా ఉన్నా తమకు ముట్టాల్సిందేనని ఉమ్మడి జిల్లాలోని పురపాలికల ప్రజాప్రతినిధులు పట్టుబడుతున్నారు. గుత్తేదారులు వారడిగినంత ఇచ్చి పనుల్లో నాణ్యతకు తిలోదకాలిస్తున్నారు. ఇది పురపాలికను బట్టి ఇది 5 నుంచి 11 శాతం వరకు ఉంటుంది. వీటికి తోడు మొదటి నుంచి ఆనవాయితీగా అధికారులకూ కొంత ముడుతోంది.

అసంతృప్తికి అదే కారణం!

ఆరుగురు గుత్తేదారులున్నారు. వీరు చేసే పనుల్లోంచి 11 శాతం కమీషన్ పాలకవర్గానికి ఇస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కౌన్సిల్‌కు నేరుగా వచ్చే వివిధ పథకాల నిధులతో చేపడుతున్న పనుల్లోనే 5 శాతం పెద్ద తలకాయలకు, 6 శాతం చిన్న తలకాయలకు అందుతున్నాయి. పెద్ద పనులకు వస్తున్న నిధుల్లోంచి పైసా రావడం లేదంటూ కౌన్సిలర్లు ఆందోళనలు చేసిన ఘటనలున్నాయి. ఇప్పటికీ పాలకవర్గంలో అసంతృప్తికి కారణం అదేనని తెలుస్తోంది. మరో 9 శాతం అధికార యంత్రానికి వెళ్తున్నట్లు సమాచారం.

డొల్లతనమే నిదర్శనం

మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 25 మంది వరకు లైసెన్స్ పొందిన గుత్తేదారులున్నారు. వారిలో పది మంది క్రమం తప్పకుండా టెండర్లు వేస్తారు. వీరిలో నలుగురు వార్డు కౌన్సిలర్లు బినామీలతో పనులు చేయిస్తున్నారు.. 36 వార్డుల్లో జరిగే అభివృద్ధి పనుల్లో పాలకవర్గానికి గుత్తేదారులు 4-5 శాతం ఇస్తున్నారు. అధికార యంత్రాగానికి మరో 8 శాతం ఇస్తున్నట్లు తెలిసింది. దాంతో పనుల్లో డొల్లతనం కనిపిస్తోంది.

ఒక్కటై పంచుకుంటారు..

నర్సంపేట పురపాలిక పరిధిలో 28 మంది గుత్తేదారులున్నారు. వీరంతా సంఘంగా ఏర్పడి పనులు పంచుకుంటారు. కమీషన్ల వ్యవహారం తేలకపోవడంతో రెండేళ్ల కిందట వేర్వేరు పద్దుల కింద నిధులు మంజూరైన పనులకు టెండర్లే పిలవలేదు. ఆ తర్వాత సమావేశమై 7 శాతం ఇచ్చేలా ఒప్పందం చేసుకోవడంతో టెండర్లు నిర్వహించారు. సంఘంలో సభ్యుడైన గుత్తేదారులు మాత్రమే టెండర్‌లో పాల్గొంటారు. బయట నుంచి ఎవరైనా ముందుకొస్తే పనులు చేయనివ్వరు. చేసినా బిల్లులు సకాలంలో చేతి కందవు.

వారే వీరు..

కౌన్సిలర్లే గుత్తేదారులు. దాంతో ముడుపుల గోల లేదు. అధికారులు, ఇంజినీరింగ్ విభాగం వారికి మాత్రం ఇవ్వాల్సిందే. జనవరిలో జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ డోర్నకల్ మున్సిపాలిటీకి రూ.25 కోట్లు ప్రకటించారు. వాటితో చేపట్టే పనులకు సంబంధించిన టెండర్లు కౌన్సిలర్లకు రావడం లేదు. వాటిని దక్కించుకునే గుత్తేదారుల నుంచి ఎంత తీసుకోవాలనే దానిపై అందరూ కలిసి సమీక్షించుకుంటున్నట్లు తెలిసింది.

తెలిసిన వారికే పనులు..

అభివృద్ధి పనులన్నీ ఒకే గుత్తేదారు చేస్తున్నారు. పాలకవర్గానికి కమీషన్ ఇవ్వకుండా కొన్ని సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు ఇచ్చారు. ఆ పనులను వారికి తెలిసిన వ్యక్తులకు అప్పగించి వారి నుంచి 7-10 శాతం ముడుపులు తీసుకున్నట్లు తెలిసింది.

పనిని బట్టి..

ఏడుగురు గుత్తేదారులున్నారు. ఇందులో నలుగురు కౌన్సిలర్లు ఉంటారు. చేసే పనులను బట్టి పాలకవర్గం కమీషన్లు తీసుకుంటుంది. సీసీరోడ్డు, ఇతర పనులైతే 6-7 శాతం, డ్రైనేజీ నిర్మాణమైతే 8-10 శాతం తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒక వార్డులో పైపులైన్ పనులు దక్కించుకున్న గుత్తేదారుడి నుంచి ఆ ప్రాంత కౌన్సిలరు 15 శాతం డిమాండ్ చేశాడు. దాంతో ఆయన పనులు చేయకుండా వెళ్లిపోయారు.

బినామీలతో..

పరకాల పట్టణంలో ఆరుగురు గుత్తేదారులున్నారు. వీరిలో కౌన్సిలర్ల బినామీలున్నారు. అభివృద్ధి పనుల నిధుల్లోంచి పాలకవర్గానికి, అధికార యంత్రాంగానికి 8 నుంచి 9 శాతం ఇవ్వాల్సిందే. టెండర్లు, పనుల కేటాయింపులో ఓ కౌన్సిలర్ భర్త కీలకంగా వ్యవహరిస్తున్నారు.

అందరికీ తలాకొంత..

పట్టణంలో 30 వార్డులున్నాయి. 65 మంది గుత్తేదారులుండగా 25 మంది పనులు చేస్తున్నారు. వీరు చేస్తున్న పనులు నుంచి పాలకవర్గానికి 4-5 శాతం ఇస్తున్నారు. అధికారయంత్రానికి మరో 5 శాతం ఇస్తున్నట్లు తెలిసింది. నర్సంపేట పట్టణం సర్వాపురం శ్మశానవాటిక నడకదారిలో టైల్స్ వేసే పనులకు పట్టణ ప్రగతిలో రూ.10 లక్షలు మంజూరయ్యాయి. నాసిరకంగా పనులు చేయిస్తున్నారు. 130 మీటర్ల నిడివితో ఉన్న నడకదారిలో మరుగుదొడ్ల వరకు టైల్స్ వేసి వదిలేశారు. దారికి రెండు వైపులా నిర్మించిన పక్క గోడలు (సైడ్ వాల్స్) వంకరగా ఉండడమేగాక అవి పలు చోట్ల పగుళ్లిచ్చాయి. పనులు పూర్తి కాకముందే పగుళ్లు వచ్చాయంటే పనులు ఎంత నాణ్యతగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. టైల్స్ వేయడం కూడా ఎత్తు పల్లాలుగా ఉంది. ఈ విషయమై పుర ఏఈ శాంతిస్వరూప్‌ను వివరణ కోరగా పనులు నిలిపివేయించామని గోడలు పగుళ్లు వచ్చిన విషయం తెలియదని పరిశీలించి చర్యలు చేపడుతామన్నారు. మహబూబాబాద్ పట్టణం జగన్‌కాలనీలో నెలన్నర కిందట రూ.5 లక్షలతో ఈ సీసీ రోడ్డు నిర్మించారు. పదికాలాల పాటు మన్నికతో ఉండాల్సిన రోడ్డు కంకర తేలి పాత రోడ్డులా మారిందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదీ పరిస్థితి..ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 9 పురపాలికల్లో కమీషన్ల పర్వం కొనసాగుతోంది. అందువల్లే అభివృద్ధి పనుల్లో నాణ్యతలోపాలు కనిపిస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.

నాణ్యత పరిశీలించాకే బిల్లులు చెల్లిస్తాం

కె.ప్రసన్నరాణి, కమిషనర్, మహబూబాబాద్పనుల్లో నాణ్యత పరిశీలించిన తర్వాతనే బిల్లులు చెల్లిస్తాం. గుత్తేదారులు పనులు ప్రారంభించే ముందు సమాచారం ఇస్తే వర్క్ ఇన్‌స్పెక్టర్ లేదా, ఏఈ దగ్గర ఉండి నిర్మాణ పనులను పర్యవేక్షిస్తుంటారు.

# సర్పంచి లేని మేజర్ పంచాయతీ

మల్లాపూర్ : మల్లాపూర్ మేజర్ గ్రామ పంచాయతీకి నాలుగున్నరేళ్లుగా సర్పంచి ఎన్నిక నిర్వహించడం లేదు. 2019లో జరిగిన ఎన్నికల్లో సర్పంచి ఎన్నికను నిర్వహించకుండా వార్డు సభ్యుల ఎన్నికను మాత్రమే నిర్వహించారు. రద్దు పరచిన సర్పంచి ఎన్నికను ఎన్నికల సంఘం నిర్వహించలేదు. దీంతో సర్పంచి లేకుండానే పదవీ కాలం ముగియనుంది. ప్రత్యేకాధికారి పాలనలో అభివృద్ధి పనులు లేక, సమస్యలు పరిష్కరించేవారు కానరాక మల్లాపూర్ గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కానరాని అభివృద్ధి..

మల్లాపూర్ మేజర్ పంచాయతీకి సర్పంచి లేకపోవడంతో అభివృద్ధిని పట్టించుకునే వారు కరవయ్యారు. ప్రత్యేక అధికారి పాలనలో కొనసాగుతున్నప్పటికీ సమస్యలు పేరుకుపోతున్నాయి. ప్రస్తుతం ఎంపీవో జగదీష్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పంచాయతీలోని వార్డు సభ్యులతో మూడు నెలలకు ఓసారి సమావేశమవుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగడంలేదు. అభివృద్ధి పనులు చేపట్టేం



దుకు అవసరమైన నిధులను సమీకరించకపోవడం, పంచాయతీలకు కేటాయిస్తున్న బడ్జెట్‌లో వీధి దీపాలు, పారిశుద్ధ్య చర్యలు మాత్రమే చేపడుతున్నారు. సీసీ రహదారులు, కాలువలు లేకపోవడంతో రహదారులపై మురుగు ప్రవహిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మౌలిక వసతుల కొరత-రమేష్, వార్డు సభ్యుడు

మల్లాపూర్ మేజర్ పంచాయతీ అభివృద్ధికి అవసరమైన మేర నిధులను ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతుంది. మల్లాపూర్ పంచాయతీకి 13వ ఆర్థిక సంఘం నుంచి ఏడాదికి దాదాపు రూ.30 లక్షలతోనే సర్దుకోవాల్సి వస్తుంది. పంచాయతీ పరిధిలో సీసీ రహదారులు, మురుగు కాలువల లేకపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

# లెక్కా పత్రం లేదు

సిరిసిల్ల : జిల్లాలోని పంచాయతీలు, పురపాలక సంఘాల్లో నిధుల వినియోగంలో ఇష్టారాజ్యం నెలకొంది. ఆడిట్‌లో ఎనిమిదేళ్లుగా వివిధ పథకాల కింద నిధుల వ్యయంలో అభ్యంతరాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. అయినా లెక్కా పత్రం చూపడం లేదు. 2021-22 ఆర్థిక సంవత్సరం ఆడిట్లో జిల్లాలోని 255 పంచాయతీలు, రెండు పురపాలికల్లో కలిపి రూ. 15.73 కోట్ల నిధుల వినియోగంలో లోపాలను గుర్తించారు. 2014-15 నుంచి ఇదే పరిస్థితి. అభ్యంతరాలకు వివరణలు ఇవ్వాలని ఆడిట్ అధికారులు లేఖలు రాసినా ఎలాంటి స్పందన ఉండటం లేదు. ఇటీవల జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ అనురాగ్ జయంతి నెల రోజుల్లో నిధుల వ్యయంపై సరైన లెక్కలు చూపించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం గమనార్హం. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ రెండు పురపాలక సంఘాలున్నాయి. వీటిలో చేపట్టే పనులకు పాలకవర్గాల తీర్మానాల మేరకు నిధులు వెచ్చించాలి. ప్రతి ఖర్చుకు బిల్లులు జత చేయాలి. కొన్ని పథకాల నిధుల్లో అయితే వాటికి లెక్క చూపలేదు. 2019లో పురపాలికల పాలకవర్గాల పదవీ కాలం ముగిసింది. ప్రత్యేకాధికారుల పాలన కొనసాగింది. అధికారులు ఇతర పనుల్లో నిమగ్నమై ఉండగా,



ఇక్కడ మాత్రం రాజకీయ పలుకుబడితో కిందిస్థాయి అధికారులు నిధులు పక్కదారి పట్టించారు. సిరిసిల్లలో 2014-15 నుంచి సరైన లెక్కలు చూపకపోగా కనీసం లేఖలకు స్పందన లేదు. వేములవాడలో తరచూ కమిషనర్లు బదిలీలు కావడం, ఇన్‌ఛార్జిలకు బాధ్యతలు అప్పగించడంతో ఆడిట్ అభ్యంతరాలపై దృష్టి సారించలేదు. జమా ఖర్చుల రికార్డుల నిర్వహణ లేకపోవడం, జీఎస్టీ, ఐటీ పన్నుల ఎగవేత, చేసిన పనులకు మించి అదనపు చెల్లింపులు, నిధుల దుర్వినియోగం వంటివి ఉన్నాయి. ఎనిమిదేళ్లలో రెండు పురపాలికలు కలిపి రూ. 37.36 కోట్ల ఖర్చులకు లెక్కలు చూపాల్సి ఉంది.

పంచాయతీల్లోనూ...

ప్రభుత్వం పల్లె ప్రగతిలో పంచాయతీలకు భారీగా నిధులు కేటాయిస్తోంది. 2020-21 ఆర్థిక సంవత్సరానికి సుమారు రూ.108 కోట్లు వచ్చాయి. వీటిని ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు నిర్దేశిత పద్దుల కింద ఖర్చు పెట్టాలి. కానీ పల్లెల్లో అభివృద్ధి, నిర్వహణ పేరున లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా ఒక పద్ధతి అంటూ ఏమీ లేదు. రూ.500 పైన ఎలాంటి చెల్లింపులు జరిపినా చెక్కుల రూపంలో చేయాలని కొత్త పంచాయతీరాజ్ చట్టంలో సూచించారు. దీనిని పట్టించుకోకుండా వేలల్లో బిల్లులు నగదు రూపంలో చెల్లించినట్లు గుర్తించారు. పన్నుల డిమాండ్, వసూలు వివరాలను ప్రత్యేక రిజిస్టరులో రాయాలి. ఇవి సరిగా లేక నిధులు పక్కదారి పడుతున్నాయి. గ్రామ సభల్లో అభ్యంతరాలు వస్తున్నా పాలకవర్గం పట్టించుకోవడం లేదు. ఎనిమిదేళ్లలో రూ. 23.83 కోట్లకు పైగా నిధుల వ్యయానికి లెక్కా పత్రం లేదు.

నోటీసులు జారీ చేస్తున్నాం

– స్వప్న, జిల్లా ఆడిట్ అధికారి

ఆడిట్ తర్వాత అభ్యంతరాలపై పంచాయతీలు, పురపాలక సంఘాలకు నోటీసులు జారీ చేస్తున్నాం. వాటికి నిర్దేశిత సమయంలో సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. అభ్యంతరాలన్నింటిని నిధుల దుర్వినియోగం కింద పరిగణించాల్సిన అవసరం లేదు. కొన్ని నిబంధనలకు విరుద్ధంగా వ్యయం చేసినవి ఉంటాయి. వాటిని పరిష్కరించుకోవాల్సిన బాధ్యత కమిషనర్లు, పంచాయతీల్లో కార్యదర్శులకు ఉంటుంది.

# పది ఫలితాల్లో లెక్క తప్పిన గణితం

జనగామ : పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఈ ఏడాది రాష్ట్రస్థాయిలో జిల్లాకు మెరుగైన స్థానం దక్కుతుందని ఆశించిన విద్యాశాఖకు నిరాశే ఎదురైంది. గతేడాది జిల్లా పదో స్థానం దక్కించుకుంది. ఈ ఏడాది కనీసం ఐదు స్థానాల లోపు నిలవాలని ఆశిస్తే.. మళ్లీ పదో స్థానంలో నిలిచింది. ఇటీవల వెల్లడైన పది పరీక్షల ఫలితాలను విశ్లేషిస్తే గణితంలో అధిక మంది విద్యార్థులు అనుత్తీర్ణులయ్యారు. గణితం తర్వాత సామాన్యశాస్త్రంలో అనుత్తీర్ణులు అధికంగా ఉన్నారు. మాతృభాష అయిన తెలుగులో సైతం కొద్ది మంది తప్పారు. తెలుగు మాధ్యమ విద్యార్థులు కొందరు ఆంగ్ల భాషలో తప్పారు. సంతోషించదగిన విషయం ఏమిటంటే.. జిల్లా వ్యాప్తంగా హిందీ భాషలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. సాంఘికశాస్త్రంలో కేవలం ముగ్గురు మాత్రమే అనుత్తీర్ణులయ్యారు.

విద్యార్థుల్లో కొరవడిన అభ్యసన సామర్థ్యం

కొవిడ్ కారణంగా గత రెండేళ్లుగా వరుసగా ప్రత్యక్ష తరగతులు జరగకపోవడం, ఈ ఏడాది ప్రత్యక్ష తరగతులు నిర్వహించినప్పటికీ అభ్యసన సామర్థ్యాలు ఆశించిన మేర పెరగకపోవడం, పరీక్ష విధానంలో మార్పుతో గణితంలో ఎక్కువ మంది విద్యార్థులు తప్పినట్లు పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. గణితంలో ప్రశ్నలు కఠినంగా రావడంతో ఉత్తీర్ణత చెందలేదని కొందరు విద్యార్థులు చెబుతున్నారు. భౌతిక, రసాయన, జీవ శాస్త్రాలన్నింటికీ ఒకే పేపరు ఉండటంతో మార్కులు సాధించలేకపోయామని మరి కొందరు విద్యార్థులు వెల్లడిస్తున్నారు.

సన్నద్ధతపై దృష్టి సారించాలి

విద్యాశాఖ ఫలితాలను విశ్లేషించి ఏఏ పాఠ్యాంశాల్లో విద్యార్థులు వెనుకబడ్డారో గుర్తించి సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేయాలి. దీంతో పాటు వచ్చే విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివే విద్యార్థులు ప్రారంభం నుంచే ఆయా పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా ప్రణాళికలు రూపొందించాలి. కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు వేసవి సెలవుల్లోనూ తమ విద్యార్థులను సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాయి. ఈ రీతిలో ప్రభుత్వ పాఠశాలలు సైతం కనీసం ఆన్‌లైన్ విధానంలో సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులు సన్నద్ధం చేయాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. ఈ దిశగా రాష్ట్ర విద్యాశాఖ చర్యలు చేపడితే పదో తరగతి ఫలితాల్లో జిల్లా స్థానం మెరుగుపడుతుందని పరిశీలకుల అభిప్రాయం.

ఉపాధ్యాయులు శ్రద్ధ కనబర్చాలి..కె.రాము, జిల్లా విద్యాశాఖాధికారి

విద్యాశాఖ అందజేసిన అభ్యాసన దీపికలతో.. పదో తరగతిలో వివిధ సబ్జెక్టుల్లో అనుత్తీర్ణులైన 703 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధమయ్యేలా ఉపాధ్యాయులు శ్రద్ధ కనబర్చాలి. జిల్లాలో చాలామంది విద్యార్థులు గణితంలో తప్పినందున వచ్చే విద్యాసంవత్సరంలో అభ్యసన సామర్థ్యంపై దృష్టి సారించేలా జాగ్రత్తలు తీసుకుంటాం.

# ఎయిడ్స్ నియంత్రణలో ఎంసీహెచ్ ముందంజ

జనగామ : ఎయిడ్స్ వ్యాప్తి చెందకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఎయిడ్స్ నియంత్ర ణలో భాగంగా దశాబ్దాల క్రితమే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏఆర్‌టీ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. లైంగిక సంబంధాల కారణంగా పెద్దలకు ఈ వ్యాధి సోకుతుంది. అయితే పిల్లలకు కూడా సోకుతుండటంతో ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్టు ద్వారా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. హెచ్‌ఐవీ కలిగిన గర్భిణులకు పుట్టే పిల్లలకు వ్యాధి సోకకుండా ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రుల్లో ప్రత్యేక పర్యవేక్షణలో వైద్య సేవలు అందిస్తున్నారు, విజయవంతంగా కాన్పులు చేస్తున్నారు. పుట్టిన శిశువులను కొన్ని నెలల పాటు పర్యవేక్షిస్తూ హెచ్‌ఐవీ బారిన పడకుండా చర్యలు చేపడుతున్నారు.

రికార్డు స్థాయిలో కాన్పులు

జనగామలో 2018లో జిల్లా ఆసుపత్రికి అనుబంధంగా 150 పడకలతో మాతా, శిశు సేవల కోసం ఎంసీహెచ్ ఆసుపత్రిని ప్రారంభిం చారు. అధునాతన భవనాలు, అత్యాధునిక వైద్య సౌకర్యాలున్న ఎంసీహెచ్‌లో రోజుకు 10 నుంచి 15 చొప్పున నెలకు 400 ప్రసవాలు చేస్తూ రికార్డు సృష్టిస్తున్నారు. హెచ్‌ఐవీ బాధిత గర్భిణులకు కూడా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ కాన్పులు చేస్తున్నారు. జిల్లా ఆసుపత్రి పరిధిలోని పీపీటీసీ, ఏఆర్‌టీ కేంద్రాల సిబ్బంది హెచ్‌ఐవీ ఉన్న గర్భిణులకు ప్రతి నెలా మందులతో పాటు చికిత్స అందిస్తున్నారు. గైనకాలజిస్టులు, నర్సింగ్, పీపీటీసీ కేంద్రం సిబ్బంది సమన్వయంతో.. హెచ్‌ఐవీ సోకిన గర్భిణులకు కాన్పులు చేస్తున్నారు. పుట్టిన పిల్లలకు వైరస్ సోకకుండా చర్యలు చేపడుతున్నారు.

నవజాత శిశువులకు ప్రత్యేక వైద్యం

హెచ్‌ఐవీ కలిగిన గర్భిణులకు పుట్టిన శిశువులకు ప్రత్యేక చికిత్స అందిస్తారు. బిడ్డ పుట్టిన 72 గంటల్లోగా నెవిరాప్రాన్ సిరప్ ఇస్తారు. 0.2 మి.లి. చొప్పున 45 రోజులు సిరప్ తాగిస్తారు. బాలింతలను మాత్రం ఎయిడ్స్ చికిత్స అందించే ఏఆర్‌టీ కేంద్రాల్లో ఉంచుతారు. శిశువులకు 45 రోజుల తర్వాత డీఎన్‌ఏ, పీసీఆర్ వంటి వైద్య పరీక్షలు చేస్తారు. 6, 12, 18 నెలలకు రాపిడ్ పరీక్షలు చేస్తారు. దీంతో సాధ్యమైనంత వరకు పిల్లలకు హెచ్‌ఐవీ నెగెటివ్‌గా తేలుతుంది. అయినప్పటికీ పాజిటివ్ ఉంటే ఏఆర్‌టీ కేంద్రాలకు తరలించి చికిత్స అందిస్తారు.

ఆసుపత్రికి గుర్తింపు

తల్లుల నుంచి పిల్లలకు హెచ్‌ఐవీ సోకకుండా విజయవంతంగా వైద్య సేవలందించిన విభాగంలో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నుంచి ఎంసీహెచ్‌కు సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్సీ పురస్కారం దక్కింది. కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌దాస్, ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, కేఎంసీ మైక్రోబయాలజీ విభాగం హెచ్‌వోడీ పద్మావతి తదితరులు ఎంసీహెచ్ ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు, పీపీటీసీ కౌన్సిలర్ పద్మ, ల్యాబ్ టెక్నీషియన్‌లు శ్రీధర్, సహదేవ్‌లకు ఈ అవార్డు అందజేసి సన్మానించారు. ఇదే విభాగంలో స్టేషన్‌ఘన్‌పూర్ సీహెచ్‌సీ కూడా సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్సీ సాధించింది.

సమష్టి కృషితో సాధించాం..

డాక్టర్ సుగుణాకర్‌రాజు, ఎంసీహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్

తల్లుల నుంచి శిశువులకు హెచ్‌ఐవీ సోకకుండా తీసుకునే జాగ్రత్తలు, చేసిన కాన్పుల సంఖ్య, మెరుగైన పనితీరుతో ఎంసీహెచ్, స్టేషన్‌ఘన్‌పూర్ సీహెచ్‌సీలు అవార్డులు సాధించాయి. పీపీటీసీ, ఏఆర్‌టీ కేంద్రాల వైద్య సిబ్బంది, వైద్యుల అంకితభావ సేవలతో తల్లుల నుంచి పిల్లలకు హెచ్‌ఐవీ సోకకుండా విజయవంతంగా కాన్పులు చేస్తున్నాం.

# సర్వజన ఆస్పత్రికి అరుదైన ఘనత



ఖమ్మం : ఖమ్మం సర్వజన ఆస్పత్రి మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. నాణ్యమైన సేవలందిస్తున్న చిన్న పిల్లల విభాగానికి ప్రత్యేక గుర్తింపు లభించింది. జాతీయ ఆరోగ్య మిషన్ ప్రకటించిన 'ముస్కాన్' సర్టిఫికేషన్‌కు ఎంపికైంది. తెలంగాణలో ఏడు ఆస్పత్రులు దరఖాస్తు చేసుకోగా ఖమ్మం ఆస్పత్రి పిల్లల విభాగం 94 శాతం మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది.

నాణ్యమైన ఆరోగ్య సంరక్షణే లక్ష్యం

దేశంలోని పౌరులందరికీ సమానమైన రీతిలో నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ అందించడమే లక్ష్యంగా జాతీయ ఆరోగ్య మిషన్ పని చేస్తోంది. పన్నెండు ఏళ్లలోపు పిల్లలకు ఆరోగ్య సేవల నాణ్యతను మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం ముస్కాన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. పిల్లల మరణాలను నివారించాలనే ఉద్దేశంతో ప్రజారోగ్య సౌకర్యాల్లో నాణ్యతను పెంపొందిస్తూ చిరునవ్వుతో కూడిన స్నేహపూర్వక సేవలను అందించడమే ఉద్దేశం కాగా.. ఖమ్మం ఆస్పత్రి దీనికి దరఖాస్తు చేసుకుంది. ప్రభుత్వ సూచికలకు అనుగుణంగా సదుపాయాలు, సేవలను మెరుగుపరచడంలో ఆస్పత్రి వైద్యాధికారులు, సిబ్బంది చేసిన కృషి ఫలితం దక్కింది. పిల్లల విభాగాలను ఆధునికీకరించి వాటిలో ఆకర్షణీయమైన, ఆహ్లాదకర వాతావరణాన్ని నెలకొల్పారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన సేవలను కొనసాగించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఈ నేపథ్యంలో ఖమ్మం ఆస్పత్రికి ముస్కాన్ సర్టిఫికేషన్ దక్కడంతో ఆస్పత్రి వైద్యాధికారులు, సిబ్బంది సంతోషాన్ని వ్యక్తం చేశారు. మూడేళ్ల పాటు ఈ ధ్రువపత్రం చెల్లుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు.

మూడు దశల్లో పరిశీలన

ఖమ్మం ఆస్పత్రి పిల్లల విభాగంలో ముస్కాన్ స్టాండర్డ్స్‌ను మూడు దశల్లో పరిశీలించారు. అంతర్గత, రాష్ట్ర, జాతీయ స్థాయి బృందాలు ఈ సర్వే నిర్వహించాయి. ఈ ఏడాది మార్చి 22, 23 తేదీల్లో జాతీయ అంచనాల బృందం తుది పరిశీలన జరిపింది. పీడియాట్రిక్ ఓపీడీ, పీడియాట్రిక్ వార్డు, నవజాత శిశు చికిత్స కేంద్రం(ఎస్‌ఎన్‌సీయూ), పోషకాహార పునరావాస కేంద్రం(ఎన్‌ఆర్‌సీ)లో ప్రొటోకాల్స్ అమలు, సూచికలను గుర్తించింది. ఇన్ఫెక్షన్ కంట్రోల్, డాక్యుమెంటేషన్, రికార్డ్ మేనేజ్‌మెంట్, క్లినికల్ ప్రొటోకాల్, పిల్లల తల్లుల, సహాయకుల అభిప్రాయం, తల్లిపాల ఆవశ్యకత, వార్డుల్లో స్నేహపూర్వక వాతావరణం, మౌలిక సదుపాయాలు, రిఫరల్ ఫాలో అప్ సేవలు ఇలా అన్ని స్థాయిల్లో ప్రమాణాలపై పరిశీలన జరిగింది. రాష్ట్రంలో ఖమ్మం, జనగాం, ఉట్నూరు, గోదావరిఖని, నల్గొండ, సంగారెడ్డి, ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రులు ముస్కాన్‌కు దరఖాస్తు చేసుకోగా అత్యధిక శాతం మార్కులు సాధించిన ఘనతను ఖమ్మం ఆస్పత్రి పిల్లల విభాగం దక్కించుకుంది.

ఏడాదికి రూ.12 లక్షల ప్రోత్సాహక నిధులు

జాతీయ ధ్రువీకరణ ముస్కాన్ సర్టిఫికేషన్ లభించిన ఆస్పత్రుల్లో పిల్లల విభాగానికి సంబంధించి ఒక్కో వార్డుకు రూ.3 లక్షల చొప్పున ప్రభుత్వం ప్రోత్సాహక పారితోషికం కింద ఏటా రూ.12 లక్షల నిధులు విడుదల చేస్తోంది. ఇందుకుగాను రాష్ట్రం నుంచి మూడేళ్ల పాటు సంతృప్తికరమైన నిఘా నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. నిధులను 25 శాతం సిబ్బంది ప్రోత్సాహం కోసం, మిగిలిన మొత్తాన్ని సదుపాయాల మెరుగుదల, బ్రాండింగ్ కార్యకలాపాలకు ఉపయోగించుకునే అవకాశం ఉంది.

సమష్టి కృషితోనే సాధ్యమైంది–డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, ఆస్పత్రి సూపరింటెండెంట్

పిల్లల విభాగానికి ముస్కాన్ గుర్తింపు లభించడం సంతోషంగా ఉంది. ఖమ్మం ఆస్పత్రికి రాష్ట్రంలోనే ప్రథమ స్థానం దక్కింది. వైద్యులు, సిబ్బంది సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది. అన్ని స్థాయిల్లో నాణ్యతా ప్రమాణాలతో కూడిన సేవలందిస్తున్నాం. మున్ముందు మరింత ఉత్సాహంతో పని చేస్తూ ప్రతిభను కొనసాగిస్తాం.

# ముప్పున్నా.. ముందుచూపేది?



భద్రాచలం : భద్రాచలం వద్ద గత ఏడాది జులైలో గోదావరి సృష్టించిన వరద బీభత్సంతో ఊళ్లన్నీ ఏర్లుగా మారాయి. దారులన్నీ సముద్రాలను తలపించాయి. అప్పట్లో క్లౌడ్ బరస్ట్‌తో భారీ వర్షాలు నమోదై ఈ దుస్థితి నెలకొందని తీవ్ర చర్చనీయాంశమైంది. ఇప్పుడిప్పుడే ఆ గాయం నుంచి స్థానికులు తేరుకుంటున్నారు. మళ్లీ వర్షాకాలం సమీపించడంతో ఎప్పుడు ఏ పరిస్థితి తలెత్తుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికార యంత్రాంగంలోనూ ముందస్తు జాగ్రత్త చర్యల ఊసే కనిపించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బఫర్ స్టాక్‌పై స్పష్టత కరవు

గత ఏడాది తరహాలో ఊహించని వరదొస్తే వందల గ్రామాలకు రాకపోకలు ఉండవు. ఇలాంటి వారికి ఆహార సమస్య తలెత్తకుండా వానలు పడక ముందే బఫర్ స్టాక్‌ను సిద్ధం చేయాలి. సురక్షిత ప్రాంతంలో మూడు నెలలకు సరిపడా బియ్యాన్ని నిల్వ చేయాలి. రవాణా వ్యవస్థ నిలిచిపోయినా తిండికి ఇబ్బంది రాకుండా ఉండాలని దీన్ని చేపడుతుంటారు. ఈ ప్రక్రియ ఈపాటికే పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ బఫర్ స్టాక్ ఎక్కడెక్కడ ఎంత నిల్వ చేస్తారో స్పష్టత కరవైంది.

సమీక్ష ఊసెత్తని అధికారులు

వరద ఎన్ని అడుగుల మేర వస్తే ఎన్ని గ్రామాలపై ప్రభావం ఉంటుందన్నది ఫ్లడ్ మాన్యువల్‌లో ఉంటుంది. 43 అడుగులకు మొదటి ప్రమాద హెచ్చరిక అమల్లోకి వచ్చినప్పటికీ ముంపు ప్రభావం అంతగా ఉండదు. 48 అడుగులకు రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయినా చెప్పుకోదగిన ఇబ్బంది ఉండదు. అయితే ఆ సమయంలో వర్షం వస్తే మాత్రం తిరుగు నీటితో లోతట్టు ప్రాంతాలు మునగడం ఖాయం. 53 అడుగులకు మూడో హెచ్చరిక అమల్లో ఉంటుంది. గత సంవత్సరం జులైలో గరిష్ఠంగా 71.3 అడుగులు నమోదైంది. 16 వేల కుటుంబాలు 80 చోట్ల ఏర్పాటు చేసిన పునరావాసాలకు తరలివెళ్లాయి. 120 గ్రామాలకు ముంపు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తాయి. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని సమగ్ర సమీక్ష, ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంది.

పక్కా ప్రణాళిక తప్పనిసరి

భద్రాచలంలో విస్తా వైపు నుంచి అన్నదాన సత్రం, రామాలయ పడమర మెట్లు, ఉత్తర ద్వారం వద్దకు భారీగా వరద చేరుతుంటుంది. తిరుగు నీళ్లను తోడి నదిలో కలిపేందుకు సరైన మోటార్లు లేకపోవడంతో రామాలయ పరిసరాలలో ముంపు పెరుగుతోంది. సాక్షాత్తూ సీఎం కేసీఆర్ ఇక్కడి పరిస్థితిని పరిశీలించి అప్పట్లో అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానికంగా పలు కాలనీలకూ ముంపు భయం పొంచి ఉంది. పక్కా ప్రణాళిక పాటించి ముందస్తు జాగ్రత్త చర్యలతోపాటు, కరకట్ట స్లూయిస్‌లకూ మరమ్మతులు చేయించాలి. 80 అడుగుల వరద వచ్చినా ఇబ్బంది కలగకుండా కట్ట ఎత్తును పెంచి శాశ్వత చర్యలు చేపట్టాలి. రెండో వంతెనను వీలైనంత తొందరగా వినియోగంలోకి తీసుకురావాలి.

# సరికొత్తగా.. నగరవాటిక

పాల్వంచ : పట్టణాల్లో పచ్చదనం పెంపు లక్ష్యంగా పురపాలక శాఖ ముందడుగు వేస్తోంది. ఇప్పటికే హరితహారం, పట్టణ ప్రకృతి వనం, బృహత్‌వనాలు, మియావకీల పేరుతో పెద్దఎత్తున మొక్కలు నాటించింది. వీటితో పాటు నగరవాటిక పేరుతో మరో కార్యక్రమాన్ని తాజాగా ఆ శాఖ ప్రారంభించింది. ఈ పథకానికి 2022లోనే బీజం పడింది. నగరవాటికలను ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు తాజాగా ఆదేశించారు. పుర అధికారులు స్థలాలను గుర్తించారు. రాష్ట్రంలో 141 పురపాలక, నగరపాలక సంస్థలుండగా.. వీటిలో కేవలం 45 మాత్రమే 'నగరవాటిక' పథకానికి ఎంపికయ్యాయి. ద్వితీయశ్రేణి పురపాలకం పాల్వంచతో పాటు ఖమ్మం నగరపాలక సంస్థలకు చోటు లభించింది. ఈ రెండు సంస్థల పరిధిలో నగరవాటికల పనులు ప్రారంభమయ్యాయి.

ఇవీ.. విశేషాలు..

వనాల నిర్వహణ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ)తో నిర్వహించనున్నట్లు సీడీఎంఏ ఉన్నతాధికారులు ఉత్తర్వుల్లో ప్రస్తావించారు.

మొక్కలు నాటడంతో పాటు వనం చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేస్తారు.

ప్రత్యేకంగా పంచవటి, ఔషధి వాటిక, నక్షత్రవనం, ఆక్సిజన్ జోన్‌లు ఉంటాయి.

నిర్మాణంలో అటవీశాఖ, ఎన్జీవోలు, పరిశ్రమలు, కార్పొరేట్ సంఘాలు, సివిల్ సొసైటీలను భాగస్వాములు చేస్తారు.

వనం నిర్వహణ నిధులను తొలి రెండేళ్ల వరకు కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది.

నిర్వహణ ఖర్చుల తాలూకా వివరాలు, రసీదులను పక్కాగా భద్రపరచాల్సి ఉంటుంది.

ఏటా జరిగే ఆడిటింగ్‌లో లెక్కల పరిశీలన జరుగుతుంది.

# పనులు ఆలస్యం.. అన్నదాతల నైరాశ్యం

గణపురం : గణపురం మండలం మీదుగా ప్రవహించే మోరంచవాగు నీటిని వృథాగా పోనివ్వకుండా రైతులకు అందించేందుకు చెక్‌డ్యాంలను నిర్మించడానికి నీటి పారుదల శాఖ ప్రణాళిక రూపొందించింది. ఈ మేరకు నిధులు మంజూరైనా పనులు సకాలంలో జరగకపోవడంతో అన్నదాతలకు నైరాశ్యం తప్పడం లేదు. గతేడాది మోరంచవాగుపై రెండు చోట్ల చెక్ డ్యాంలు నిర్మించడానికి నిధులు మంజూరయ్యాయి. చెల్పూరులో ఒకటి, నగరంపల్లిలో మరొకదాన్ని నిర్మించడానికి రూ.5 కోట్లు మంజూరవగా ఒక్కోదానికి రూ.2.50 కోట్లను కేటాయించారు. చెల్పూరు చెక్ డ్యాం పనులు పూర్తి కాకుండానే నిధులను మొత్తం గుత్తేదారుకు మంజూరు చేయడంతో ఆయన పనులను నిలిపివేసిన విషయం తెలిసిందే. నగరంపల్లిలో కొద్దిరోజుల క్రితం పనులు ప్రారంభించారు. ఇక్కడ మోరంచవాగు నీటి ప్రవాహం బాగా ఉండడంతో పనులు చేయడం సాధ్య పడడం లేదని అధికారులు



చెప్పుకొచ్చారు. ఇటీవల నీటి ప్రవాహాన్ని మళ్లించి పనులు ప్రారంభించారు. మొత్తం ఎనిమిది అడుగుల ఎత్తు, 30 మీటర్ల పొడవుతో నిర్మించాలి. రైతుల పొలాలకు నీరు అందించేందుకు రెండు కాల్వలు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం నాలుగడుగుల ఎత్తుదాకా నిర్మించారు. వర్షాకాలంలోపు పనులు పూర్తికావని రైతులు అంటున్నారు. ఈ వేసవిలో పూర్తయితే రైతుల పంటలకు నీరందేది. నగరంపల్లితో పాటు అప్పయ్యపల్లి, సీతారాంపురం రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

పనులు పూర్తయ్యేలా ప్రయత్నిస్తాం

వెంకటేశ్వర్లు, ఐబీ ఈఈ

పనులు పూర్తయ్యేలా మా వంతుగా ప్రయత్నం చేస్తున్నాం.. నీటి ప్రవాహం వల్లే జాప్యం జరిగింది. ఆ నీటిని మళ్లించి పనులు చేస్తున్నాం. చెల్పూరులో ఆగిన పనులను పూర్తి చేయిస్తాం. వర్షాలు పడి వాగు ఉద్ధృతి పెరిగితే.. మళ్లింపు కాల్వ కొట్టుకుపోతుంది కదా.. పనులెలా చేయిస్తారని అడిగితే దానికి ఎవరేమీ చేయలేమని సమాధానమిచ్చారు.

# రామప్ప-లక్నవరం అనుసంధానమెప్పుడో?

ములుగు : దేవాదుల నీటిని రామప్ప నుంచి లక్నవరం చెరువులోకి తరలించే ప్రక్రియ అమలులో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఏళ్లు గడుస్తున్నా లక్నవరం ప్రాంత రైతుల ఆశలు కలగానే మిగిలిపోతున్నాయి. రామప్ప చెరువును రిజర్వాయర్‌గా నిర్ధారించి దేవాదుల నీటిని పైపులైన్ ద్వారా రామప్ప చెరువులోకి తరలించి ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు కాల్వలు, పైపులైన్ ద్వారా సరఫరా చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఇప్పటికే రామప్ప నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు నీరు తరలిపోతోంది. కానీ ములుగు జిల్లా ప్రజలకు చుక్క నీరు అందడం లేదు. ఇక్కడి నుంచే సొరంగ మార్గం ద్వారా హనుమకొండ, జనగామ జిల్లాలకు తరలించేందుకు పనులు జరుగుతున్నాయి. ఇంత వరకు బాగానే ఉంది. ఏళ్లు గడుస్తున్నా రామప్ప నుంచి లక్నవరం సరస్సులోకి నీటిని తరలించే ప్రక్రియ మాత్రం ముందుకు సాగడం లేదు. ఈ ప్రక్రియ ప్రతిపాదనలకే పరిమితం అయింది.

ఆర్థిక శాఖ వద్ద 8 నెలలుగా..

రైతులకు నష్ట పరిహారం కింద చెల్లించాల్సిన నిధులు రాష్ట్ర ఆర్థిక శాఖ వద్ద ఆగిపోయాయి. కాగితాల్లో కేటాయింపు జరిగినప్పటికీ నిధులు విడుదల కాలేదు. క్లియరెన్స్ కోసం చెక్కును నీటి పారుదల శాఖ ద్వారా ప్రభుత్వానికి పంపించారు. ఆర్థిక శాఖ వద్ద చెక్కు ఆగి సుమారు 8 నెలలు కావస్తోంది. నిరీక్షణతోనే కాలం గడిచిపోతోంది. అక్కడి నుంచి క్లియరెన్స్ వచ్చిన తర్వాత భూ సేకరణ అధికారి ఖాతాలో నిధులు జమ కావాల్సి ఉంటుంది. అక్కడి నుంచి రైతులకు ప్రకటించిన నష్ట పరిహారం అవార్డు ప్రకారం నేరుగా రైతుల ఖాతాలో సొమ్ము జమ అయ్యే అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.



ఎదురుచూపులు

రైతులకు పరిహారం చెల్లింపులో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. రామప్ప నుంచి ఫీడర్ ఛానల్ ద్వారా లక్నవరం చెరువులోకి నీటిని విడుదల చేయాలనేది ప్రభుత్వ నిర్ణయం. సుమారు 4.850 కిలోమీటర్ల పొడవునా కాల్వ తవ్వకం పనులు చేపట్టి నీటిని తరలించేందుకు నిర్ణయించారు. కొందరు రైతులు సుమారు 100 ఎకరాల భూములు కోల్పోవాల్సి వస్తోంది. ములుగు మండలంలోని కాసిందేవిపేట రెవెన్యూ గ్రామం పరిధిలో 48.30 ఎకరాలు, ఇంచెర్ల రెవెన్యూ గ్రామం పరిధిలో 52.30 ఎకరాల భూమిని కోల్పోతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జనరల్ అవార్డు పద్ధతిన రైతులకు పరిహారం చెల్లించాలని నిర్ణయించారు. ఎదురుచూపులతోనే కాలం గడిచిపోతోంది.

203 మంది రైతులు.. రూ.3.73 కోట్లు

రామప్ప-లక్నవరం చెరువు వరకు కాల్వ నిర్మాణం వల్ల ములుగు మండలం కాసిందేవిపేట, ఇంచెర్ల రెవెన్యూ గ్రామాలకు చెందిన 203 రైతులు తమ భూములను కోల్పోతున్నారు. కాసిందేవిపేట పరిధిలో 54 మంది రైతులు 48.30 ఎకరాలు, ఇంచెర్ల పరిధిలో 149 రైతులు 52.30 ఎకరాలు కోల్పోతున్నారు. కాసిందేవిపేట పరిధిలోని 54 మంది రైతులకు రూ.1.20 కోట్లు, ఇంచెర్లకు చెందిన 149 మంది రైతులకు రూ. 2.53 కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉంది.

# కొత్తగా.. తెలుగు, ఆంగ్లం జతగా

ఆదిలాబాద్ : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడుల్లో విద్యనందించే ఉద్దేశంతో ఈ ఏడాది ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఆంగ్లమాధ్యమం ప్రవేశపెట్టారు. ఇప్పటికే సక్సెస్ పాఠశాలల పేరిట కొన్ని ఉన్నత.. మరి కొన్ని చోట్ల ప్రాథమిక పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమం సాగుతున్నప్పటికి ఈ విద్యాసంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమంలో బోధించనున్నారు. దీనికోసం అన్ని యాజమాన్య పరిధిలోని ప్రభుత్వ ఉపాధ్యాయులందరికి ప్రత్యక్ష శిక్షణతో పాటు ఆన్‌లైన్‌లో వివిధ పద్ధతుల్లో శిక్షణ ఇచ్చారు. పాఠాలు తేలికగా అర్థం చేసుకునేందుకు గాను పుస్తకాల ముద్రణలో మార్పులు చేశారు.

విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు...ఒకేసారి ఆంగ్లమాధ్యమంలో చదవాలంటే విద్యార్థులకు కొంత ఇబ్బందే. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తెలుగు మాధ్యమం నుంచి వచ్చిన విద్యార్థులకు భాషాపరమైన ఇబ్బందులు పడుతారు.దీనిని దృష్టిలో ఉంచుకుని పుస్తకాలు సైతం రెండు భాషల్లో ముద్రించారు. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు ప్రతీ పుస్తకంలో అంటే భాషేతర పుస్తకాలైన గణితం, ఈవీఎస్, సామాన్యశాస్త్రం, భౌతిక, జీవశాస్త్రం, సాంఘికశాస్త్ర




పుస్తకాలలో అన్ని పాఠ్యాంశాలను ఒక పేజీలో తెలుగు ..దీని పక్క పేజీలో ఇదే పాఠ్యాంశానికి సంబంధించిన అంశాలను ఆంగ్ల భాషలో ముద్రించారు. దీనివల్ల విద్యార్థులు ఆంగ్లమాధ్యమంలో సులభంగా చదువుకునే అవకాశం ఉంది. పదానికి అర్థం తెలియకున్నా... భాషాపరమైన ఇబ్బందులన్నా పక్కనే ఉన్న పేజీలో తెలుగులో ఉండటంతో అటు విద్యార్థులకు...ఇటు ఉపాధ్యాయులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

రెండు విభాగాలుగా

ప్రతీ పుస్తకాన్ని ఆంగ్లం, తెలుగులో ముద్రిస్తే పుస్తకం పేజీల సంఖ్య రెట్టింపై బరువు పెరగకుండా ఉండేందుకు గాను ప్రతీ పుస్తకాన్ని (ద్విభాషా పుస్తకం) రెండు విభాగాలుగా విభజించారు.. సగం పాఠాలను భాగం 1, ఆంగ్లంలో పార్ట్ 1 పేరుతో విభజించారు..ప్రస్తుతం సగం పాఠాలకు సంబంధించిన మొదటి భాగం పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి.. మరి కొద్ది రోజుల్లో రెండో భాగం పుస్తకాలు రానున్నాయి.

ఎంతో ప్రయోజనకరం

జాజాల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు, ప్రాథమిక పాఠశాల పొన్కల్

ఒకే పుస్తకంలో పాఠ్యాంశాలను రెండు భాషల్లో ముద్రించడం వల్ల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు ప్రయోజనకరంగా ఉంటుంది. తెలుగు మాధ్యమం నుంచి వచ్చే విద్యార్థులకు వచ్చే భాషాపరమైన ఇబ్బందులు, అర్థాలు వెంటనే తెలుసుకోవచ్చు ఉపాధ్యాయులు తేలికగా బోధించవచ్చు

# పురుగుల బియ్యం.. తినాలంటే భయం

ఆదిలాబాద్: ప్రభుత్వం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యనందించాలన్న ఉద్దేశంతో వసతిగృహ పాఠశాలలు, గురుకులాలను ఏర్పాటు చేసింది. అందులో నాణ్యమైన విద్యతోపాటు రుచికరమైన భోజనం అందిస్తోంది. కానీ వీటికి బియ్యం కాకుండా, మిగతా సామగ్రిని టెండర్‌దార్లు సరఫరా చేస్తారు. బియ్యం మాత్రం పౌరసరఫరాల అధికారులు ఆయా మండలాల్లోని ఎంఎల్ఎస్ కేంద్రాల ద్వారా సమకూర్చుతారు. కస్తూర్బా, మైనార్టీ, ఆశ్రమ పాఠశాలలు మినహా మిగిలిన అన్ని గురుకులాల్లో వంటల కోసం టెండర్లను నిర్వహించి వారి ద్వారా భోజనం తయారు చేయిస్తారు. అయితే ప్రభుత్వం సరఫరా చేసే బియ్యంలోనే పురుగులు వస్తున్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అధికారులు చొరవ చూపితేనే..వసతిగృహాలకు సరఫరా చేసే బియ్యం సంబంధిత అధికారులు పరిశీలించి నాణ్యమైన వాటిని అందజేయాలి. కానీ సంబంధిత ఎంఎల్ఎస్ అధికారులు వారికి వచ్చిన బియ్యాన్ని నేరుగా వసతి గృహాలకు సరఫరా చేయడంతోనే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వచ్చిన బియ్యాన్ని సంబంధిత కళాశాల ప్రిన్సిపల్స్ ప్రత్యేకంగా వ్యక్తులను నియమించి బాగు చేయించాలి. కానీ చాలా చోట్ల ప్రిన్సిపల్స్ తమ దగ్గర డబ్బులు లేవని, టెండర్‌దార్లే బియ్యాన్ని బాగు చేయించి భోజనం తయారు చేయించాలని చెబుతుండటంతో.. సమస్యలు వస్తున్నాయి.

పలు వసతి గృహాల్లో బోధన విధానం బాగుంటే భోజనం బాగోలేకపోవడం, మరికొన్ని చోట్లు భోజనం బాగుంటే విద్య సక్రమంగా లేకపోవడంతో.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. చాలాచోట్ల బియ్యంలో పురుగులు వస్తున్నాయి. ప్రిన్సిపల్స్, టెండర్‌దార్లు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ఓతి గృహాల్లో భోజనం బాగుండటం లేదని, అన్నంలో తరచూ పురుగులు వస్తున్నాయంటూ.. ఇప్పటికే జిల్లాలోని పలుచోట్ల విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఇటీవల భైంసాలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులు నిరసన చేపట్టారు. ముథోల్‌లోని గిరిజన గురుకులంలో సైతం భోజనంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు ఆరోపించారు. వసతి గృహాల్లో ఇంత జరుగుతున్నా సంబంధిత జిల్లా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం : – శ్రీకళ, పౌరసరఫరాల డీఎం

వసతి గృహాలకు, పాఠశాలలకు సరఫరా చేసే బియ్యంపై ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నాం. పురుగులు రాకుండా పింగ్వేషన్(రసాయన మందు కలపడం) చేస్తున్నాం. పాఠశాలలు, వసతిగృహాలను తనిఖీ చేసి నిల్వచేసే విధానంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. వంట చేసే ముందు బియ్యాన్ని రెండు, మూడు సార్లు కడిగాలని సూచిస్తున్నాం.

# నియామకాల్లో జాప్యం.. రైతులకు కష్టం




ఆదిలాబాద్ : జిల్లాలో మూడుచోట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఎప్పుడు కొలువుదీరతాయా అని రైతులు ఎదురు చూస్తున్నారు. పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడం, యార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషించే ఈ పదవుల నియామకంలో కొంతకాలంగా జాప్యం ఏర్పడుతోంది. ఆదిలాబాద్, జైనథ్, ఇచ్చోడ ఛైర్మన్, ఇతర డైరెక్టర్ల పదవులు ఖాళీగా ఉన్నాయి. దీంతో రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. మరోపక్క పదవీ కాలాన్ని మూడేళ్ల వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో మరింత పోటీ ఏర్పడింది. పంట ఉత్పత్తుల కొనుగోళ్లు ఆరంభం కాకమునుపే ఈ నియామకాలను చేపడ్తేనే ఫలితముంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.రైతులు, వ్యాపారుల మధ్య ఈ పాలకవర్గాలే సంధానకర్తలుగా వ్యవహరిస్తాయి. ఏ కష్టమొచ్చినా రైతులు ఈ కమిటీలకు మొరపెట్టుకునే వీలుంటుంది. పదవుల నియామకం ముఖ్యమని తెలిసినా నిర్లక్ష్యం కనబడుతోంది. జిల్లాలోని అయిదు వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ప్రస్తుతం ఇంద్రవెల్లి, బోథ్ మార్కెట్లలో మాత్రమే పాలకవర్గాలున్నాయి. మిగతా ఆదిలాబాద్, జైనథ్, ఇచ్చోడలో ఖాళీగా ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలోనే ఆదిలాబాద్‌కు పేరు ఉమ్మడి జిల్లాలోనే ఆదాయపరంగా ఆదిలాబాద్ మార్కెట్‌కు మంచి పేరుంది. ఏటా పత్తి, సోయా పంటలతోపాటు ఇతర పంటలను ఇక్కడికి తీసుకొస్తుంటారు. వేలాదిమంది రైతులతో ఈ యార్డు నెలల తరబడి రద్దీగా ఉంది. అంతటి కీలకమైన ఈ ఆదిలాబాద్ మార్కెట్ పదవి గత ఏడాదిన్నరగా ఖాళీగా ఉండటంతో ఇప్పటికే రెండు సీజన్లు వెళ్లిపోయాయి. ఎస్టీ–మహిళకు రిజర్వు అయిన ఈ స్థానం కోసం ఆదిలాబాద్ గ్రామీణ ప్రాంతంతోపాటు యార్డు పరిధిలోకి వచ్చే బోథ్ నియోజకవర్గంలోని తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల నుంచి ఆశావహులు రోజురోజుకు పెరుగుతున్నా, నియామకంపై ముందడగు పడటం లేదు. ఆదిలాబాద్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే జైనథ్ మార్కెట్ పదవి సైతం ఎస్టీ–మహిళకు కేటాయించారు. జైనథ్, బేల మండలాలకు చెందిన ఆశావహులను ఈ పదవి ఊరిస్తూనే ఉంది. ఆగస్టు నెల వస్తే ఖాళీగా ఏర్పడి రెండేళ్లు పూర్తి అవుతుంది. అయినా నియామకంపై చిన్నచూపే చూస్తున్నారు.

ఇచ్చోడలోనూ అదే పరిస్థితి

బోథ్ నియోజకరవర్గ పరిధిలోకి వచ్చే ఇచ్చోడ యార్డు చైర్మన్ పదవి నియామకంలోనూ ఇదే పరిస్థితి. ఎస్టీ–మహిళకు రిజర్వు చేసిన ఈ పదవి కోసం ఇచ్చోడ, బజార్‌హత్నూర్ మండలాలకు చెందిన రైతుల కోసం ఏర్పాటు చేసిన ఈ యార్డులో అనేక సమస్యలున్నాయి. షెడ్డుకు సైతం రంధ్రం పడి వర్షాకాలంలో పంట ఉత్పత్తులు తడిసిపోతున్నాయి. గత 14 నెలలుగా ఇక్కడ పదవి నియామకం చేపట్టడంలేదు.

మూడేళ్ల పదవీకాలంఇంతముందు సభ్యుల సంఖ్య 14 ఉండగా కొత్త ఆదేశాల మేరకు సంఖ్య 18కి పెరిగింది. ఇందులో 12 మంది రైతులు డైరెక్టర్లుగా ఉంటారు. ఇందులోంచే ఒకరిని ఛైర్మన్‌గా నియమిస్తారు. మరో ఇద్దరు వ్యాపారులు డైరెక్టర్లుగా ఉంటారు. మిగతా నలుగురు ఎక్స్‌అఫిషియో సభ్యులు. ఇంతకు ముందు ఏడాది వరకు మాత్రమే పాలకవర్గ పదవీకాలన్ని నిర్ణయించారు. ప్రభుత్వ ఆమోదం మేరకు ఆరు నెలలు, ఆ తరువాత మరో ఆరు నెలలు రెండుసార్లు పొడిగించే అవకాశం కల్పించారు. తద్వారా మొత్తం రెండు సంవత్సరాలు పదవీకాలం చేపట్టడానికి అవకాశం ఉండేది. కొత్త ఆదేశాల మేరకు రెండేళ్లపాటు పదవీకాలం ఉంటుంది. ప్రభుత్వ ఆమోదంతో ఆరునెలలు, మరో ఆరు నెలలు ఇలా రెండుసార్లు పదవీ కాలం పొడిగించుకోవచ్చు తద్వారా 3 సంవత్సరాల పాటు పదవీకాలం చేపట్టవచ్చు అందుకనే ఈ పదవులకు తాజాగా డిమాండ్ పెరిగింది.

# వ్యాధులు మోసుకొచ్చిన వర్షం



ఆదిలాబాద్ : భారీ వర్షాలతో స్తంభించిన జనజీవనం పూర్తి స్థాయిలో తేరుకోకముందే వ్యాధుల వ్యాప్తి ఆందోళన కలిగిస్తోంది. ఐటీడీఏ పరిధిలోని ఉట్నూరు, ఇంద్రవెల్లి, సిరికొండ, నార్నూరు, గాదిగూడ, జైనూరు, సిర్పూరు(యు), లింగాపూర్ ఏజెన్సీ మండలాలలో కురిసిన భారీ వర్షాలతో పారిశుద్ధ్యం లోపించింది. దోమలు, క్రిమికీటకాల వ్యాప్తి గణనీయంగా పెరిగిపోయి అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి. నీరు కలుషితమై అతిసారం విజృంభిస్తోంది. గ్రామీణ ప్రాంత ప్రజలు వాంతులు, విరేజనాలు, విషజ్వరాలతో అస్వస్థతకు గురవుతున్నారు.ఇంటింటా వ్యాధిగ్రస్థులే..ఏజెన్సీలో ఇంటింటా విషజ్వరాలు, వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. మారుమూల గ్రామాల ప్రజలు తొలుత తమ సమీపంలోని పీహెచ్‌సీలకు వెళ్తున్నారు. అక్కడ నయం కాకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చూయించుకొని జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. తగ్గకపోవడంతో ఉట్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చేరుతున్నారు.

అధికారులు స్పందించాలి..ఏజెన్సీలో వ్యాధుల వ్యాప్తిపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించకుండా వెంటనే అవగాహన కార్యక్రమాలతో ప్రజలను చైతన్యం చేయాలి. పారిశుద్ధ్యలోపం, కలుషినీటి సమస్యలను పరిష్కరించాలి. వ్యాధిగ్రస్థులకు తక్షణమే మెరుగైన వైద్యసేవలు అందేలా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.ఒకే పడకపై చికిత్స పొందుతున్న ఈ చిన్నారుల పేర్లు శివాణి(06), తనుశ్రీ(03). వీరు నార్నూరు మండలం

నాగల్‌కొండకు చెందిన సుభాష్, సరిత దంపతుల పిల్లలు. నాలుగు రోజుల నుంచి వీరిద్దరు తీవ్రజ్వరం, విరేచనాలతో బాధపడుతున్నారు. కుటుంబ సభ్యులు వీరిని అక్కడి పీహెచ్‌సీతో పాటు ప్రైవేటు ఆసుపత్రికి తీసికెళ్లినా తగ్గకపోవడంతో ఉట్నూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చి చేర్పించారు.అతిసారంతో బాధపడుతూ.. ఉట్నూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈ బాబు ప్రణీత్. ఉట్నూరులోని బాయవాడకు చెందిన లత, దిలీప్‌ల కుమారుడు.

రెండు రోజుల నుంచి వాంతులతో అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఇలా ఏజెన్సీ వ్యాప్తంగా అతిసారం, అంటు వ్యాధులు గ్రామీణులను ఇబ్బంది కలిగిస్తున్నాయి.కలుషిత నీరు..భారీ వర్షాలు, వరదలతో మిషన్ భగీరథ పైపు లైనింగ్ తెగిపోయి ఏజెన్సీ ప్రాంతంలో రక్షిత నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో బావులు, చేతిపంపులలోని క్లోరినేషన్ చేయని కలుషితమైన నీటిని తాగి గ్రామీణ ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మరోవైపు గ్రామాలలో చేతిపంపులు, రక్షిత నీటి పథకాల వద్ద పారిశుద్ధ్యం లోపించి వ్యాధులకు దారితీస్తోంది.

# తెగిన తీగలు.. కూలిన స్తంభాలు..

నిర్మల్ : జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు విద్యుత్తు తీగలు దారాల్లా తెగిపోయాయి..నియంత్రికలు, టవర్లు, స్తంభాలు నిలువెల్లా వణికి నేలమట్టమయ్యాయి. విద్యుత్తుశాఖకు తీవ్ర నష్టాన్ని తెచ్చిపెట్టాయి. ఇంకొన్ని నీటిలో కొట్టుకుపోయాయి. 95 పల్లెలు అంధకారంలో మగ్గాయి. కరెంటు సరఫరా లేకపోవడంతో చాలా గ్రామాలకు భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది.. దాదాపు రూ.10 కోట్ల నష్టం వాటిల్లిందని ఆ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.10 మండలాల్లో తీవ్రం..భారీ వర్షాలకు జిల్లాలోని పది మండలాల్లో విద్యుత్తుశాఖకు తీవ్ర నష్టం వాటిల్లింది. కడెం, దస్తురాబాద్, పెంబి, ఖానాపూర్, మామడ, లక్ష్మణచాంద, భైంసా, ముథోల్, బాసర, తానూరు మండలాలతోపాటు భైంసా పట్టణంలోని స్తంభాలు, నియంత్రికలు దెబ్బతిన్నాయి. సోన్, నిర్మల్ గ్రామీణం, సారంగాపూర్, దిలావర్‌పూర్ మండలాల్లోనూ కొంత నష్టం సంభవించింది.గోదావరి, వాగు ప్రవాహం వెంబడి ఎక్కువగా..ఏకధాటి వానలతో నదులు, వాగులు ఉప్పొంగాయి. వాటి పరీవాహక ప్రాంతాల్లోని విద్యుత్తు టవర్లు, స్తంభాలు, నియంత్రికలు వరదలో కొట్టుకుపోయాయి. గోదావరి ప్రవహించే ప్రాంతాలైన సోన్, కూచన్‌పెల్లి, పార్‌పెల్లి, మునిపెల్లి, చింతల్‌చాంద, కమల్‌కోట్, పొన్కల్, కొత్తూరు, ఆదర్శనగర్, తదితర గ్రామాల సమీపంలో, కనకాపూర్ వాగు వెళ్లే చామన్‌పెల్లి, లక్ష్మణచాంద, బాబాపూర్, నర్సాపూర్ గ్రామాల దగ్గర, స్వర్ణ, సుద్దవాగు ప్రవహించే ప్రాంతాల్లోనూ ఎక్కువగా నేలమట్టమయ్యాయి.

యుద్ధప్రాతిపదికన పనులువిద్యుత్తు పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన పనులు చేయిస్తున్నారు అధికారులు. అయినా చాలా ప్రాంతాల్లో రహదారులు దెబ్బతినడంతో కొత్తగా సామగ్రి తీసుకెళ్లలేని పరిస్థితులు ఏర్పడటంతో మరమ్మతులు చేయించడంలో కొంత జాప్యం జరుగుతోంది. కడెం మండలంలోని కొన్ని గ్రామాలకు ఉట్నూరు మీదుగా వెళ్లి పనులు చేయిస్తున్నారు. స్తంభాలు, నియంత్రికలు ఇంకా నీటిలోనే ఉండటంతో పునరుద్ధరణ పనులు చేపట్టడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. భారీ వర్షాల కారణంగా తొలుత 95 గ్రామాలకు కరెంటు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. వారం నుంచి మరమ్మతులు చేస్తుండటంతో ఇప్పటివరకు 91 గ్రామాలకు విద్యుత్తును పునరుద్ధరించారు. మరో నాలుగు గ్రామాలైన కడెం మండలం గంగాపూర్, అలంపెల్లి, పెంబి మండలం రాంనగర్, యాపల్‌గూడ అంధకారంలోనే ఉన్నాయి. ఇక్కడ బుధవారం వరకు కరెంటు సరఫరా జరిగేలా పనులు చేయిస్తున్నామని ఆ శాఖ అధికారులు వెల్లడించారు. అవసరమైన స్తంభాలను డిచ్‌పెల్లి, సిరిసిల్ల, మంచిర్యాల నుంచి తెప్పిస్తున్నామని పేర్కొన్నారు.

# నిపుణుల మాట.. కొలువుకు బాట

ఆదిలాబాద్ :రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉద్యోగాల కోసం అభ్యర్థులు పూర్తిస్థాయిలో కసరత్తు చేస్తున్నారు. వచ్చే నెలలో పోలీసు ప్రాథమిక పరీక్ష నేపథ్యంలో అభ్యర్థులు ఆందోళన వీడి.. ప్రశాంతంగా పరీక్ష రాయాలని నిపుణులు సూచిస్తున్నారు. బీసీ స్టడీ సర్కిల్లో ప్రస్తుతం కొనసాగుతున్న గ్రూప్–1, కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాల శిక్షణలో అభ్యర్థులను కొలువు సాధించే దిశగా తయారు చేస్తున్నారు. ప్రస్తుతం శిక్షణలో ఉన్న 400 మందికి మరో పది రోజుల్లో శిక్షణ తరగతులు ముగుస్తాయి. వచ్చే నెలలో గ్రూప్ 2, 3, 4, టీఆర్టీ, టీచర్, గురుకులం టీచర్ ఉద్యోగాలకు శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయి. దాదాపు 600 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. బీసీ స్టడీ సర్కిల్లో పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా 20 సూత్రాలతో కూడిన సూచికను సైతం ఏర్పాటు చేశారు. పరీక్ష సమయం దగ్గర పడుతుండటంతో ఏ అంశాలపై శ్రద్ధ వహించి ఎలా సన్నద్ధం అవ్వాలనే అంశంపై నిపుణుల మాటల్లోనే..

అవగాహన చేసుకోవాలి– దేవేందర్‌రావు, విశ్రాంత ఆంగ్ల అధ్యాపకుడు ప్రభుత్వ మహిళా కళాశాల ఆదిలాబాద్

మొదట ప్రతి విషయంపై అవగాహన చేసుకోవాలి. ప్రామాణిక పాఠ్య పుస్తకాలు చదవాలి. చదివేటప్పుడు ముఖ్య అంశాలను గుర్తుంచుకోవాలి. పరీక్ష సమయం కంటే వారం ముందు ముఖ్యంశాలు, అంతర్గత అంశాలను పాయింట్ల రూపంలో సంక్షిప్తంగా రాసుకోవాలి. అదే విధంగా పఠనం చేయాలి. కచ్చితంగా అన్వయింపు అభ్యాసం, పాత పరీక్ష ప్రశ్న పత్రాలను పరిష్కరించడం అభ్యాసం చేయాలి. పాత పరీక్ష పేపర్లను చదవకపోతే అభ్యర్థుల్లో భయం ఉంటుంది. ప్రతిరోజు ఉదయం 15 నిమిషాల పాటు శాస్త్రీయ సంగీతం వినాలి. దీనివల్ల భయం పోతుంది. మనసుకు ఊరట లభిస్తుంది.

పునశ్చరణ ముఖ్యం– డి.లక్ష్మీనరసింహం, ప్రధాన ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాగజ్‌నగర్

అభ్యర్థులు తయారు చేసుకున్న నోట్స్ పునశ్చరణ చేయాలి. వీలైనన్ని నమూనా పరీక్షలు రాసి ఏ విభాగంలో మార్కులు తగ్గుతున్నాయో గమనించి ఆ విభాగాన్ని మళ్లీ చదవాలి. తెలంగాణ ఉద్యమం, సంస్కృతి, చరిత్ర, తెలంగాణ ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక దృష్టి



సారించాలి. గత తొమ్మిది నెలల వర్తమాన అంశాలను అధ్యయనం చేయాలి. ఇక చివరగా అభ్యర్థులు ఆత్మవిశ్వాసంతో ఎలాంటి ఆందోళన చెందకుండా పరీక్షకు హాజరుకావాలి. చదివింది గుర్తుండాలంటే సిలబస్‌లోని విభాగాల నుంచి ముఖ్యంశాలు రాసుకొని వాటిని పదేపదే చదవడం ద్వారా గుర్తుంచుకోవచ్చు భౌగోలిక శాస్త్రం లాంటి అంశాలను అధ్యయనం చేసేటప్పుడు అట్లాస్‌ను దగ్గర ఉంచుకొని చదవడం ద్వారా సులభంగా గుర్తుంచుకోవచ్చు.

దినపత్రికలను చదవాలి– రోషిరెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణుడు

అభ్యర్థులు సంబంధిత సిలబస్‌పై పూర్తి పట్టు సాధించి ఆ అంశాలపై సొంత నోట్స్ తయారు చేసుకోవాలి. ప్రతి నిత్యం దినపత్రికలను చదవాలి. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ, అంశాలతో పాటుగా రాజకీయ, ఆర్థిక పరమైన ప్రభుత్వ పథకాలు అందుబాటులో ఉన్న వివిధ వనరులపై పూర్తి పట్టు సాధించాలి. ఈ మధ్య కాలంలో జరిగే పరిణామాలు వాటిపై వచ్చిన వ్యాసాలను పూర్తి స్థాయిలో చదవాలి. ప్రశ్న పత్రంలో ఒక అభ్యర్థిగా భాషపై పట్టు సాధించాలంటే ప్రచురణ భాష తెలిసి ఉండాలి. అలాంటప్పుడే వ్యాస ప్రశ్నలకు జవాబులు దిద్దేవారిని ఆకట్టుకుంటాయి. మంచి మార్కులు సాధించవచ్చు అభ్యర్థులు మానసిక ప్రశాంతత కోసం రోజూ యోగా, వ్యాయామం సాధన చేస్తే ఒత్తిడి నుంచి ఉపశమనం పొందొచ్చు.

నమూనా పరీక్షలతో ఉపయుక్తం– ప్రవీణ్‌కుమార్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్, ఆదిలాబాద్

అభ్యర్థులు చదివే సిలబస్ ఏరోజు పూర్తి అవుతుందో అదేరోజు నమూనా పరీక్ష రాయాలి. దీని వల్ల అభ్యర్థి సమర్థత తెలిసి భయంపోతుంది. పరీక్ష సమయం కంటే పదిరోజుల ముందునుంచి రోజూ రెండు నమూనా పరీక్షలు పూర్తి సిలబస్‌పైన రాయాలి. గతంలో జరిగిన కానిస్టేబుల్, ఎస్ఐ పరీక్ష పేపర్‌లను మళ్లీ రాయాలి. ప్రతిరోజు వార్త పత్రికలో వచ్చే అంశాలను నోట్ చేసుకోవాలి. కఠినమైన విషయాలను అభ్యర్థులు ఉమ్మడిగా కలిసి చదవాలి. స్టడీ సర్కిల్లో పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి 20 సూత్రాలతో కూడిన ప్రత్యేక సూచికను తెలుగు, ఆంగ్ల భాషలో ఏర్పాటు చేశాం. కానిస్టేబుల్, ఎస్ఐ శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులు ప్రధానంగా అర్థమెటిక్, రీజనింగ్ ప్రశ్నలను గుర్తుంచుకోవడానికి సులభమైన మార్గాన్ని ఎంచుకోవాలి.

పాత ప్రశ్నపత్రాలు చూసుకోవాలి– ఎస్.విజయబాబు, విశ్రాంత అధ్యాపకులు ప్రభుత్వ డిగ్రీ, పీజీ, కళాశాల ఆదిలాబాద్

పాత ప్రశ్నపత్రాలను చూసుకోవాలి. ముఖ్యమైన అంశాలను ఎన్నుకొని వాటిని చదవాలి. అన్ని విషయాలను సమయపాలన ప్రకారంగా చదవాలి. సాయంత్రం ఒకగంట విశ్రాంతి తీసుకోవాలి. ధ్యానం, పాటలు వినడం, యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుంది. పరీక్ష కేంద్రానికి వెళ్లేటప్పుడు ఎలాంటి భయాందోళన ఉండకూడదు. భయం వల్ల నష్టం జరగవచ్చు పరీక్ష రాసే సమయంలో నిశ్చింతంగా రాయాలి.

# అరకొరగా డీఏపీ సరఫరా

ఖమ్మం : జిల్లాలో డీఏపీ కొరతతో రైతులు దిగులు చెందుతున్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధంతో ఐపీఎల్ కంపెనీకి చెందిన ఎర్ర పొటాష్ సరఫరా కూడా చాలా వరకు నిలిచిపోయింది. దీంతో కొద్దికొద్దిగా వస్తున్న తెల్ల పొటాష్‌ను రైతులు ఉపయోగిస్తున్నారు. అవసరాల మేరకు ఆయా కంపెనీలు ఎరువును సక్రమంగా సరఫరా చేయకుండా తాత్సారం చేస్తుండటంతో పలు ప్రాంతాల్లో రైతులు డీఏపీ దొరక్క ఇబ్బందిపడుతున్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురవటంతో రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు నిండి జలకళ సంతరించుకున్నాయి. ఇప్పుడు పత్తి, పెసర, వరి, మొక్కజొన్న, చెరకు వంటి పంటలకు వేసేందుకు దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు.లింకు మందులతో విక్రయాలుకేంద్ర ప్రభుత్వం డీఏపీ 50కిలోల బస్తా ఒక్కింటికి రూ.2,500 పైగా రాయితీ ప్రకటించి ఈ మొత్తాన్ని ఆయా కంపెనీలకు చెల్లిస్తోంది. కొరత రాకుండా అన్నదాతలకు రూ.1350 చొప్పున సరఫరా చేయాలని ఆదేశించింది. కానీ, ఉత్పత్తి వ్యయం పెరిగి తమకు నష్టాలు వస్తున్నాయని ఆయా కంపెనీల ప్రతినిధులు చెబుతూ, డీఏపీతో లింకు మందులను ముడిపెట్టి తమకు అంటగడుతున్నాయని రిటైల్ డీలర్ల సంఘాలు ఇటీవల కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖకు ఫిర్యాదు చేశాయి.





అమరావతి ప్రాంతంలో రాత్రి వేళలో ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలను నిరసిస్తూ రాజధాని రైతులు ఆందోళనకు దిగారు. మందడంలో రోడ్డుపై వాహన రాకపోకలను అడ్డుకుని నిరసన తెలిపారు. ఇసుక అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు గెలవాలి.. అమరావతి నిలవాలి, పాలన చేతగాని సీఎం రాజీనామా చేయాలి అంటూ రైతులు నినాదాలు చేస్తూ ప్లకార్డులతో ప్రదర్శన చేశారు.

# ఆ మంత్రికి పోలవరంకు ఎన్ని గేట్లుంటాయో తెలుసా?



అమరావతి: మహానాడులో టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన మానిఫెస్టోతో వైసీపీ నేతలు గింగిరాలు తిరుగుతున్నారని, అందుకే చంద్రబాబు, లోకేష్‌పై పిచ్చి వాగుడు వాగుతున్నారని టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. మంగళవారం ఆమె విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ మాయల పకీర్ కారుమూరి నాగేశ్వరరావు తన పని సక్రమంగా చేయకుండా కారుకూతలు కూస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ మానిఫెస్టో టిష్యూ పేపర్ లాంటిదని, దానిని ప్రజలు ఏనాడో చించేశారన్నారు. అంబటి రాంబాబు మంత్రిగా ఏం చేశారని ఆమె ప్రశ్నించారు. పోలవరం డీపీఆర్ ఆమోదించటం చేతకాదని, నిర్వాసితులకు ఇళ్లు కట్టలేదని, పరిహారం ఇచ్చే దమ్ము లేదు.. కానీ సిగ్గులేకుండా చంద్రబాబు గురించి మాట్లాడుతారా? అంటూ దుయ్యబట్టారు. మృతుల కుటుంబాల దగ్గర వాటాలు అడిగిన నీచచరిత్ర అంబటిదని, మంత్రిగా ఏనాడైనా ఏ ప్రాజెక్టు దగ్గరకైనా వెళ్లి సమీక్ష చేశారా? అని నిలదీశారు. పోలవరంకు ఎన్ని గేట్లుంటాయో తెలుసా? సుజల స్రవంతి అడ్రస్ ఎక్కడుందో తెలుసా? అని ఆమె ప్రశ్నించారు.

# వాళ్లు లేకుండా ప్రజల్లోకి వెళ్లగలరా?.. వైసీపీ మంత్రులకు ధూళిపాళ్ల సవాల్



అమరావతి: టీడీపీకి 23 సీట్లేనన్న మంత్రులు, వైసీపీ ఎమ్మెల్యేలు మహానాడులో చంద్రబాబు వదిలిన టీజర్‌కే బట్టలు చింపుకుంటున్నారని మాజీ శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... టీజర్‌కే మతిపోతే.. అసలు సినిమా వస్తే జగన్‌మోహన్ రెడ్డి సహా అందరూ పెట్టాబేడా సర్దుకోవాల్సిందే అని అన్నారు. చంద్రబాబు ప్రజల భవిష్యత్‌కు గ్యారంటీ అనగానే, జగన్ అతని బృందానికి వారి భవిష్యత్‌పై భయం మొదలైందన్నారు. దొంగ సర్టిఫికెట్స్‌తో దొంగ చదువులు చదివిన తమ్మినేని స్పీకర్ స్థానం పరువుతీశారని విమర్శించారు. చంద్రబాబుకు ఎన్.ఎస్.జీ కమెండోలు ఎందుకంటున్న సీతారామ్... పోలీసులు, భద్రతాసిబ్బంది లేకుండా జనంలోకివెళ్లి మాట్లాడగలరా అని ప్రశ్నించారు. 98 శాతంపైగా హామీలు అమలు చేశామంటున్న జగన్‌మోహన్ రెడ్డి, అతని ఎమ్మెల్యేలు, మంత్రులు... పోలీసులు, భద్రతా సిబ్బంది లేకుండా ప్రజల్లోకి వెళ్లగలరా అంటూ ఆయన సవాల్ విసిరారు. మంత్రి అయ్యాక భూములు, దేవాదాయశాఖ సొమ్ము, భక్తుల విరాళాలు కొట్టేసికొట్టేసి 'కొట్టు' కోట్లకు పడగలెత్తాడని అతని నియోజకవర్గవాసులే చెబుతున్నారన్నారు. చంద్రబాబు, టీడీపీపై విమర్శలు చేయడంపై పెట్టే శ్రద్ధలో సగమైనా అంబటి పోలవరంపై పెడితే బాగుండేదని వ్యాఖ్యలు చేశారు. అంబటి జలవనరుల మంత్రి అయ్యాకే పోలవరం ప్రాజెక్ట్ బ్యారేజ్‌గా మారిందన్నారు. కాకాణి వ్యవసాయశాఖ మంత్రి కావడం రాష్ట్ర రైతాంగానికి నిజంగా పెద్ద దౌర్భాగ్యమనే చెప్పాలన్నారు. చంద్రబాబును, టీడీపీని ఇష్టమొచ్చినట్టు తిట్టినా, తన మంత్రి పదవి జగన్ ఎందుకు పీకేశాడో కొడాలినాని చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ఇచ్చిన బీఫామ్ వల్లే తాను రాజకీయాల్లో ఉన్నాననే వాస్తవాన్ని నాని గుర్తిస్తే మంచిది అంటూ ధూళిపాళ్ల నరేంద్ర హితవుపలికారు.

# బాబూ.. మేనిఫెస్టో అమలుపై చర్చకు రా.. మంత్రి కారుమూరి సవాల్

అమరావతి: చంద్రబాబు అలవి కాని హామీలతో ప్రజలను మళ్లీ బురిడీ కొట్టించే యత్నాలు చేస్తున్నారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దుయ్యబట్టారు. మంగళవారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, మేనిఫెస్టో టిష్యూ పేపర్ కన్నా హీనమని, అది ఎందుకూ పనికిరాదు. ఒక్కటీ అమలు కాదంటూ మండిపడ్డారు. 'బాబూ.. నీకు చిత్తశుద్ధి ఉంటే.. మేనిఫెస్టో అమలుపై చర్చకు రా.. ఎవరు ఎన్ని అమలు చేశారో చూద్దాం' అంటూ మంత్రి కారుమూరి సవాల్ విసిరారు.

**మంత్రి ఏమన్నారంటే.. ఆయన మాటల్లోనే..**

**టిష్యూ పేపర్‌కన్నా హీనం:** చంద్రబాబూ.. నీ మొఖంలో రాజకీయంగా చావుకళ వచ్చింది. నీలో ప్రేతకళ కనిపిస్తోంది. అయినా సరే పదవీకాంక్ష. ఇంకా దోచుకోవాలన్న తపన వదలట్లేదు. ఇప్పుడు మేనిఫెస్టో ప్రకటించావు. ఆడబిడ్డలకు 18 ఏళ్లు నిండిన వారికి ఏటా రూ.18 వేల చొప్పున 5 ఏళ్లలో రూ.90 వేలు ఇస్తామంటున్నారు. ప్రజలు నిన్ను నమ్ముతారా? ఇంకా తల్లికి వందనం. దీపం పథకం. అన్నీ అబద్ధాలు. మహిళలకు ఉచిత ప్రయాణం. ఇది గతంలో కూడా చెప్పావు. అమలు చేయలేదు. పిల్లలకు ఉచిత ప్రయాణం అని, దాన్ని కూడా అమలు చేయలేదు.

**పారదర్శకంగా మా పథకాలు:** సీఎం వైఎస్ జగన్, పదవీ బాధ్యతలు స్వీకరించి, నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రమంతా వేడుక చేసుకుంటున్నారు. కులం, మతం, వర్గం, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రధాన అర్హతగా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. పథకాల అమలులో ఎక్కడా అవినీతికి తావు లేదు. వైఎస్ జగన్ పాలనలో నిరుపేదలతో పాటు, అన్ని వర్గాల వారు ఎంతో సంతోషంగా ఉన్నారు. నిజానికి గతంలో సీఎంగా చంద్రబాబు ఉన్నప్పుడు.. కలెక్టర్లకు ఒక మాట చెప్పారు. తన పార్టీ వారికి ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. అదే సీఎం జగన్, కులం, మతం, వర్గం, ప్రాంతం, రాజకీయాలకు అతీతంగా, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకం అందాలని నిర్దేశించారు. అందుకే ఎక్కడా అవినీతికి తావు లేకుండా, ఇంటి గడప వద్దే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి.

చదవండి: చంద్రబాబు భయాన్నే ఈనాడు హైలైట్ చేసింది

**అంతులేని ప్రజాదరణ:** అందుకే ప్రజలు మమ్మల్ని ఎంతో ఆదరిస్తున్నారు. మా జిల్లాలో చంద్రబాబు రైతు పోరు బాట పేరుతో పాదయాత్ర చేస్తే, కనీసం 500 మంది కూడా లేరు. అదే నా నియోజకవర్గంలో నేను నిన్న బైక్ ర్యాలీ నిర్వహిస్తే.. దాదాపు 6,500 మోటర్‌సైకిళ్లపై.. దాదాపు 13 వేల మంది స్వచ్ఛందంగా పాల్గొన్నారు. చంద్రబాబు పాదయాత్రలో 450 మంది పాల్గొంటే, సభకు కేవలం 1100 మంది మాత్రమే హాజరయ్యారు. అదే మా సభకు ఏకంగా 13 వేల మంది హాజరయ్యారు. ప్రభుత్వ పథకాలకు ఆ స్థాయిలో ఆదరణ లభిస్తోంది.

**అన్ని వర్గాలకు న్యాయం:** సీఎం జగన్.. తన పాలనలో రైతులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను ఎన్నో విధాలుగా ఆదుకుంటున్నారు. రాజ్యసభకు నలుగురు బీసీలను పంపిస్తే, చంద్రబాబు ఒక్కరిని కూడా పంపలేదు. ఇంకా జగన్ 17 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చారు. వారిలో కొందరు అట్టడుగు వర్గంలో ఉన్నవారు కూడా ఉన్నారు. ఇంకా 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, ఆ పదవులు కూడా ఇచ్చారు. అదే చంద్రబాబు బీసీలను ఏమన్నాడు? వారి తోక కట్ చేస్తానన్నాడు. తాట తీస్తానన్నాడు. ప్రతి కులాన్ని అవమానించి మాట్లాడడం చంద్రబాబుకు అలవాటు. వారిని కేవలం ఓటింగ్ యంత్రాలుగా చూడడమే తప్ప, ఒక్క బీసీకి కూడా ఆయన న్యాయం చేయలేదు. అదే జగన్ పాలనలో ఇంటింటికీ వెళ్తున్న వలంటీర్లు.. ప్రజలకు ప్రభుత్వ పథకాలను ఇంటి గడప వద్దే అందిస్తున్నారు. 31 లక్షల ఇళ్లపట్టాలు ఇవ్వడంతో పాటు, దాదాపు 22 లక్షల ఇళ్లు కట్టించి ఇస్తున్నాం.

**బాబు సిద్ధాంతం. దోచుకో–దాచుకో:** 2014 ఎన్నికల్లో 650 వాగ్దానాలు చేసిన చంద్రబాబు, ఏ ఒక్కటి నెరవేర్చలేదు. రైతుల రుణాలు రూ.87,612 కోట్లు మాఫీ చేస్తానని చెప్పి, ఆ మాట కూడా తప్పాడు. చివర్లో ఎన్నికల ముందు పౌర సరఫరాల సంస్థ పేరుతో రుణం తీసుకుని పసుపు కుంకుమ కింద పంపిణీ చేశాడు. ప్రతి ఇంట్లో, ప్రతి ఒక్కరికి ఏదో ఒక పథకం అందించిన సీఎం జగన్, ప్రతి ఇంట్లో.. ప్రతి ఒక్కరి మనసుల్లో ఉన్నారు. అదే చంద్రబాబు తన పాలనలో చేసిందని చెప్పుకోవడానికి ఏ ఒక్కటి కూడా లేదు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో రూ.371 కోట్ల అవినీతి. విచ్చలవిడిగా బెల్టు షాపులు ఏర్పాటు చేయించావు. దుర్మార్గంగా దోపిడి. దోచుకో. దాచుకో.. అదే బాబు సిద్ధాంతం.

**బాబుకు ఓటమి తప్పదు:** దీంతో చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు ఈర్ష్యతో తట్టుకోలేకపోతున్నారు.

ప్రభుత్వంపై అదేపనిగా బురద చల్లుతున్నారు. అయితే మీరు ఎన్ని చేసినా, మీకు మళ్లీ ఓటమి తప్పదు. నాడు ఎన్టీఆర్‌ను అన్ని రకాలుగా వేధించి, ఆయన నుంచి పదవిని, పార్టీని లాక్కున్నారు. ఆయనను అంతులేని క్షోభకు గురి చేశారు. అంత దుర్మార్గుడు చంద్రబాబు అని.. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు.





కాంబోడియా రాజు నోరోదోమ్ సిహమోని భారత రాష్ట్రపతి భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ ఆయనకు ఘన స్వాగతం పలికారు.

# చట్టబద్ధంగా రావాల్సిన వాటి కోసం అడగడం తప్పా?: బొప్పరాజు



విజయవాడ: కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు హామీకి ఇప్పటివరకు అతీగతీ లేకుండా పోయిందని ఏపీ ఐకాస అమరావతి ఉద్యోగ సంఘాల నేతలు అన్నారు. కేంద్ర ప్రభుత్వం సూచించిన 14శాతం పెంపును కూడా అమలు చేయడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు డిమాండ్లను పరిష్కరించాలని విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద ఏపీ ఐకాస అమరావతి ఉద్యోగ సంఘాల నేతలు దీక్ష చేపట్టారు. ఏపీ ఐకాస అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ధర్నా చౌక్ వద్ద మీడియాతో మాట్లాడారు. "ఉద్యమ కార్యాచరణ వల్ల ఒక్క డీఏ ఇస్తామని ప్రకటించారు. రాబోయే ఉద్యమమంతా ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగులదే. ఉద్యమం చేస్తున్నామనే మళ్లీ అ.ని.శా. దాడులు మొదలయ్యాయి.

ఇలా దాడులు చేసి ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతోంది. చట్టబద్ధంగా రావాల్సిన వాటి కోసం అడగడం తప్పా? 84 రోజులుగా ఆందళనలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. ఉద్యమం ఆగాలంటే డిమాండ్లు పరిష్కరించాల్సిందే. 50 డిమాండ్ల పరిష్కారం మినహా ప్రత్యామ్నాయం లేదు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం తీవ్రమవుతుంది. అదే జరిగితే పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే.

**సచివాలయ ఉద్యోగులకు డీఏలు అవసరం లేదా? :** ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి ప్రభుత్వ వాదనే వినిపిస్తున్నారు. గతంలోనే వెంకట్రామిరెడ్డి ఈ విషయాన్ని ప్రకటించారు. సచివాలయ ఉద్యోగులకు పీఆర్‌సీ బకాయిలు, డీఏలు అవసరం లేదా? సచివాలయ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు ఉండాలా?లేదా? వెంకట్రామిరెడ్డి చెప్పినవన్నీ ప్రభుత్వం చెప్పినట్లుగానే భావిస్తున్నా. ఇదంతా ప్రభుత్వ కుట్రలో భాగమే" అని బొప్పరాజు వ్యాఖ్యానించారు.

# చంద్రబాబు మ్యానిఫెస్టోను చింపి పార్సెల్ పంపుతున్నా..



ఓ వైపు సంక్షేమం.. మరో వైపు అభివృద్ధితో నాలుగు సంవత్సరాలు దిగ్విజయంగా జగన్మోహన్ రెడ్డి పరిపాలన సాగిందని మంత్రి జోగి రమేష్ అన్నారు. నేడు ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో ఏ రాష్ట్రంలో.. ఏ సీఎం చేయని అభివృద్ధిని జగన్మోహన్ రెడ్డి చేశారని కొనియాడారు. రెండు లక్షల పదకొండు వేల కోట్ల రూపాయలు నేరుగా పేదల ఖాతాలోకి జమ చేశారని జోగి రమేష్ పేర్కొన్నారు. 35 లక్షల మంది పేదలకు ఇళ్ళ స్థలాలు అందించి.. నిర్మాణ పనులు శరవేగంగా చేస్తున్నామన్నారు. జగన్మోహన్ రెడ్డి కేబినెట్‌లో తనకు అవకాశం దక్కడం అదృష్టమన్నారు. ఎంత మంది రాక్షసులు, దుర్మార్గులు అడ్డుపడ్డినా ప్రజల గుండెల్లో చెరగని స్థానాన్ని సీఎం జగన్ సంపాదించారన్నారు. రాష్ట్రానికి జగన్మోహన్ రెడ్డి పరిపాలన అవసరమన్నారు. చంద్రబాబు మ్యానిఫెస్టోను చింపి పార్సెల్ పంపుతున్నానని జగన్ పేర్కొన్నారు. 2014లో 650 హామీలతో చంద్రబాబు మ్యానిఫెస్టోను తెచ్చాడన్నారు. ఆ హామీల్లో కేవలం పది హామీలను కూడా నెరవేర్చలేక పోయారని జోగి రమేష్ పేర్కొన్నారు. సిగ్గు, మానవత్వం, విలువ, విశ్వసనీయత లేని వ్యక్తి చంద్రబాబు నాయుడు అని విమర్శించారు. మురికి పట్టి మలినమైన చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. శతకోటి వాగ్దానాలు ఇచ్చినా ప్రజలు పట్టించుకోరని జోగి రమేష్ పేర్కొన్నారు.

# ఆరు ప్యాలెస్‌లున్న జగన్ పెత్తందారు కాదా?



అమరావతి: ఆరు ప్యాలెస్‌లు, భారతీ సిమెంట్స్, సండూర్ పవర్స్ లాంటి 16 భారీ కంపెనీలు ఉన్న సీఎం జగన్ పేదవాడు ఎలా అవుతారని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. 2004లో రూ.1.73 కోట్ల ఆస్తితో.. ఉన్న ఇల్లు కూడా అమ్ముకోవడానికి సిద్ధమైన వ్యక్తి అతి తక్కువ సమయంలో రూ.లక్షల కోట్లు సంపాదించడం పెత్తందారీతనం కాదా? అని ఓ ప్రకటనలో నిలదీశారు.

"సొంత బాబాయ్‌పై గొడ్డలివేటు వేయించడం, హంతకుల్ని కాపాడటం, తండ్రి ఆస్తిలో న్యాయమైన వాటా అడిగిన చెల్లిని, తల్లిని తరిమేయడం, ఎంపీ రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ చేయించి.. దాన్ని వీడియో తీయించి ఆనందించడం, ప్రజావ్యతిరేక విధానాల్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించడం, ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలు ధ్వంసం చేయడం, ప్రభుత్వ ప్రకటనల్లో మంత్రుల ఫొటోలు తీసేసి తన ఒక్కడి ఫొటో మాత్రమే వేసుకోవడం ఇవన్నీ పెత్తందారీతనం కాదా? రాష్ట్రంలోని అన్ని పార్టీలు, హైకోర్టు, కేంద్ర ప్రభుత్వం అమరావతిని రాజధానిగా గుర్తించినా... జగన్ దాన్ని నిర్వీర్యం చేశారు. తీర్మానాలు లేకుండా స్థానిక సంస్థల నిధులు రూ.12 వేల కోట్లు దారి మళ్లించారు. తన దోపిడీ లక్షణాల్ని ఎదుటి వారికి అంటగట్టడం జగన్‌రెడ్డి నైజం. ఆయనపై 40 క్రిమినల్ కేసులుంటే అందులో 24...420 కేసులే. జగన్‌రెడ్డిని మించిన పెత్తందారు...దోపిడీదారు దేశంలోనే లేరు. దోచుకో, పంచుకో, తినుకో పేటెంట్ జగన్‌రెడ్డిదే..." అని కొల్లు రవీంద్ర మండిపడ్డారు.

# వైసీపీ నాలుగేళ్ల పాలనపై చంద్రబాబు వ్యంగ్య ట్వీట్



అమరావతి: వైసీపీ ప్రభుత్వ నాలుగేళ్ల పాలనపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ట్విట్టర్ వేదికగా వ్యంగ్రాస్త్రాలు సంధించారు. ప్రజా వేదిక కూల్చివేతకు ఆదేశాలు ఇస్తూ ఫస్ట్ డిమాలిషన్ విల్ స్టార్ట్ ఫ్రం దిస్ బిల్డింగ్ అంటూ జగన్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ట్వీట్ చేశారు. వైఎస్ జగన్ మొదట చెప్పిన తమ విధ్వంస విధానాన్నే తాను, తన ప్రభుత్వం నిత్యం పాటిస్తున్నారు అంటూ సెటైర్ విసిరారు. మొదటి రోజు ప్రజా వేదిక కూల్చివేత నిర్ణయంతో మొదలైన రాష్ట్ర విధ్వంసం.... నాలుగేళ్లు పూర్తి చేసుకుని 5వ ఏట అడుగు పెట్టిందన్నారు. సీఎంగా జగన్ ఇచ్చిన తొలి ఆదేశాలు... ప్రజా వేదిక కల్చివేత దృశ్యాలు ఉన్న వీడియోను చంద్రబాబు నాయుడు ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.

## బులుగు చీరలోన హనీరోజ్ సిగ్గుల మొగ్గాయెను

బులుగు చీరలో సిగ్గులొలకబోస్తోంది. నునులేత పాల బుగ్గలు ఓ ముద్దిమ్మని కవ్విస్తున్నాయ్. కొంటెగా అలా ఓర చూపు చూస్తూ గుండెల్ని గిల్లేస్తోంది.. ఇంతకీ ఎవరీ నవయవ్వన జవ్వని? .. బాలకృష్ణ మాస్ ఫ్యాన్స్ కి పెద్దగా పరిచయం చేయాల్సిన అవసరం లేని పేరు ఇది. హనీ ఈజ్ ది బెస్ట్ అని అనాలా.. హనీ రోజ్ అని పిలవాలా మీరే నిర్ణయించండి. ఈ మల్లూ బ్యూటీ ఏ ముహూర్తాన మాస్ హీరో బాలకృష్ణ సరసన నటించిందో కానీ క్రేజ్ అమాంతం స్కైని టచ్ చేసింది. ప్రస్తుతం హనీ మూడ్ లో యావత్ ప్రపంచం ఊగిసలాడుతోంది. వీరసింహారెడ్డి రిలీజ్ తర్వాత ఒక్కసారిగా ఈ బ్యూటీ పేరు లైమ్ లైట్ లోకి వచ్చింది. అంతకుముందు తెలుగులో నటించినా కానీ ఈ అమ్మడికి ఏమంత క్రేజ్ రాలేదు. కానీ ఇటీవల తనకు దక్కిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని టాలీవుడ్ లో



క్రేజీ బ్యూటీగా వెలిగిపోతోంది. ఇప్పుడు ఇరు తెలుగు రాష్ట్రాల్లో షాపుల ఓపెనింగులు రిబ్బను కటింగులు అంటూ బాగానే సైడ్ ఇన్ కం ఆర్జిస్తోంది. ఇటీవల ఓ షాప్ ఓపెనింగుకి వెళ్లిన హనీరోజ్ ని భారీ మాస్ ఫ్యాన్స్ రౌండప్ చేసిన సంగతి తెలిసిందే. దీనిని బట్టి తనకు ఎలాంటి క్రేజ్ ఉందో అర్థం చేసుకోవాలి. ప్రస్తుతం హనీరోజ్ నెక్స్ట్ ఏంటి? అంటూ అంతా ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. కానీ ఇంతవరకూ తన నుంచి ఘనమైన ప్రకటన ఒక్కటీ రాలేదు. కానీ వరుసగా స్క్రిప్టులు వినే పనిలో హనీ బిజీగా ఉందని మాత్రం తెలిసింది. ఇటీవలి కాలంలో సీనియర్ హీరోలకు కథానాయికల కొరత ఉంది. దీనిని ఈ భామ ఎలా ఎన్ క్యాష్ (సద్వినియోగం) చేసుకుంటుందో వేచి చూడాలి. ప్రస్తుతానికి ఒక్కో షాప్ ఓపెనింగుకు 8లక్షల నుంచి 10లక్షలు కోట్ చేస్తూ నాలుగు చేతులా ఆర్జిస్తోందని సమాచారం. అలాగే హనీరోజ్ బ్లూ శారీలో హొయలొలికించిన తాజా ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. 2005లో మలయాళంలో విడుదలైన బాయ్ ఫ్రెండ్ చిత్రంతో మాలీవుడ్ లో అడుగుపెట్టిన ఈ బ్యూటీ కన్నడ- తమిళ- తెలుగు సినిమాల్లో నటించింది. హనీ రోజ్ తెలుగులో తొలిసారి ఆలయం- ఈ వర్షం సాక్షిగా సినిమాల్లో నటించింది. నందమూరి బాలకృష్ణ హీరోగా వీర సింహా రెడ్డి (107వ సినిమా)తో హీరోయిన్ గా బిగ్ బ్రేక్ అందుకుంది.

## నాలుగు పదుల వయసులోనూ నీ యవ్వ తగ్గేదేలే

ఇష్టం సినిమా తో హీరోయిన్ గా రెండు దశాబ్దాల క్రితం ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ శ్రియ శరణ్ స్టార్ హీరోయిన్ గా ఒక వెలుగు వెలిగింది. ఈ రెండు దశాబ్దాల కాలంలో పుష్కర కాలం పాటు స్టార్ హీరోయిన్ గా వెలుగు వెలిగిన విషయం తెల్సిందే. ఇప్పుడు కూడా సినిమా ల్లో అడపాదడపా సినిమాలు చేస్తూ సోషల్ మీడియాలో అందాల ఆరబోత చేస్తూ అలరిస్తోంది. పెళ్లి అయ్యి తల్లి గా కూడా మారిన శ్రియ అందం విషయంలో మాత్రం పదేళ్ల క్రితం ఎలా ఉందో ఇప్పుడు కూడా అలాగే ఉంది. కొన్ని సార్లు ఇలాంటి హాట్ హాట్ కాస్ట్యూమ్స్ ధరించిన సమయంలో అంతకు మించి ఉ



న్నట్లు కనిపిస్తుంది. తాజాగా శ్రియ ఈ ఫొటోలు షేర్ చేసి క్లీ వేజ్ షో తో మతి పోగొడుతుంది. అందానికి వయసుతో సంబంధం ఏంటి అన్నట్టుగా ముద్దుగుమ్మ శ్రియ శరణ్ అందాల ఆరబోత చేస్తూ నాలుగు పదుల వయసులోనూ నీ యవ్వ తగ్గేదేలే అన్నట్లుగా దూసుకు పోతుంది. ఆకట్టుకునే ఫిజిక్ తో పాటు ఈ అమ్మడి యొక్క స్కిన్ టోన్ చాలా స్పెషల్ అంటూ అభిమానులు తెగ కామెంట్స్ చేస్తూ ఈ ఫొటోలను లైక్ చేస్తున్నారు. సిల్వర్ డ్రెస్ లో నడుము నాభి అందాన్ని చూపిస్తూ... క్లీ వేజ్ షో తో జీరో సైజ్ అందాన్ని చూపిస్తూ శ్రియ శరన్ పిచెక్కిస్తోంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేశారు.

సోషల్ మీడియాలో ప్రస్తుతం ఈ ఫొటోలు తెగ వైరల్ అవుతున్నాయి. ఆకట్టుకునే అందాల విందు ఈ అమ్మడి సొంతం అంటూ మరోసారి నిరూపితం అయ్యింది.




## మెగాఫోన్ పట్టే హీరోయిన్లు వీళ్లే!



సినీ పరిశ్రమ అంటే మేల్ డామినేటెడ్ ఇండస్ట్రీ. 24 శాఖల్లోనూ 95 శాతం వాళ్లే ఉంటారు. హీరోల దగ్గర నుంచి లైట్ బోయ్ వరకూ అన్ని పరిశ్రమల్లోనూ శాతం వాళ్లదే ఎక్కువే. అందులోనూ దర్శకుల సంఖ్య చూసుకుంటే మరీ అధికంగా కనిపిస్తుంది. వాళ్లకు ధీటుగా మహిళలు అన్ని శాఖల్లోరాణించాలని ఎప్పటి కప్పుడు తెరపైకి వస్తూనే ఉంటుంది. ముఖ్యంగా పారితోషికం విషయంలో స్టార్ హీరోలకు ఎందులో తక్కు వంటూ సమాన హోదా కోసం గొంతెత్తిన భామలెంతో మంది. కానీ అది జరుగుతుంతో లేదో? తెలియదు గానీ! తాజాగా భవిష్యత్ లేడీ డైరెక్టర్లను మాత్రం చూడటానికి ఛాన్స్ కనిపిస్తుంది. అందులోనూ సౌత్ నుంచి ఎక్కువగా మహిళా దర్శకులు తయారయ్యే అవకాశం ఉందనిపిస్తుంది. క్రియేటి వ్ రంగంలోనూ రాణిస్తామంటూ కొంత మంది భామలు ఎప్పటికప్పుడు చెబుతుంటారు. వాళ్లలో శ్రుతి హాసన్ ముందుంటుంది. అమ్మడు మల్టీ ట్యాలెంటెండ్. గాయని..ప్లేబ్యాక్ సింగర్ గా...వాయిస్ ఆర్టిస్ట్ గా సత్తా చాటింది. త్వరలో దర్శకురాలిగానూ మారుతానంటూ చెప్పిన సందర్భాలెన్నో. మెగా ఫోన్ పట్టి తండ్రి కమల్ హాసన్ తరహాలో వైవిధ్యమైన సినిమాలు చేస్తానని అంటోంది. శ్రుతి హాసన్ పై అక్కడి పరిశ్రమ సైతం అంతే నమ్మకంతో ఉంది. తమిళ్ లో లేడీ డైరెక్టర్లు పెద్దగా కనిపించరు. ఈ నేపథ్యంలో భవిష్యత్ కోలీవుడ్ ఆశాకిరణంలా శ్రుతి హాసన్ ని చెప్పొచ్చు. అలాగే అదే పరిశ్రమకి చెందిన నివేదా పేతురాజు కూడా దర్శకురాలిగా రాణించాలని ఇటీవల ఓ సందర్భంలో రివీల్ చేసింది. ఖాళీ సమయంలో కథలు కూడా రాస్తానని రివీల్ చేసింది. అయితే ఆ బాధ్యతలు తీసుకోవడానికి మరికొంత సమయం పడుతుందని అంటుంది. అలాగే జూనియర్ సౌందర్యగా నీరాజనాలు అందుకుంటోన్న నిత్యామీనన్ కూడా క్రియేటివ్ రంగంలో రాణించాలని ఎంతో ఆశపడుతుంది. సరైన టైమ్ చూసుకుని కెప్టెన్ కుర్చీ ఎక్కేస్తానని ఇటీవలే ఓ సందర్భంలో తెలిపింది. ఇక మాలీవుడ్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ కూడా దర్శకురాలిగా సత్తా చాటుతానంటోంది. నటిగా ప్రయాణానికి ఫుల్ స్టాప్ పెట్టిన తదుపరి దర్శకురాలిగా మారిపోతానంటుంది. అలాగే యువ సంచలనం ఫరియా అబ్దుల్లా కూడా మెగా ఫక్షన్ పట్టాలని చూస్తుంది. ప్రస్తుతానికి తనలో నటిని మాత్రమే చూస్తున్నారని....అంతర్గతంగా మంచి క్రియేటర్ దాగి ఉన్నాడు అన్న సంగతి ఏదో రోజు బయట పడుతుందని ధీమా వ్యక్తం చేసింది. మహిళలు ముందుకొస్తే మరిన్ని కొత్త కథలు రావడానికి అవకాశం ఉంది. భావోద్వేగాల్లో వైవిధ్యత..కొత్త తరహా పాత్రలు...లేడీ ఓరియేంటెడ్ చిత్రాలు రావడానికి ఛాన్స్ ఉంది.

## యువరాణి రూపానికి మతి భ్రమించాలంతే!





NTR 30 చిత్రంతో టాలీవుడ్ లో అడుగు పెడుతోంది కపూర్ కాంపౌండ్ యువరాణి జాన్వీ. అతిలోక సుందరి శ్రీదేవి నటవారసురాలి రాకతో తెలుగు లోగిళ్లు పునీతం కాబోతున్నాయంటూ అభిమానులు ఎంతో ఎగ్జయిట్ అవుతున్నారు. సోషల్ మీడియాల్లో జాన్వీకి వెల్ కం చెబుతూ తారక్ ఫ్యాన్స్ లవ్ హార్ట్ ఈమోజీలను షేర్ చేస్తున్నారు. ఆరంగేట్రమే యంగ్ యమ ఎన్టీఆర్ సరసన జాక్ పాట్ పట్టేసిందంటూ పొగిడేస్తున్నారు.

జాన్వీ బాలీవుడ్ నుంచి టాలీవుడ్ లో అడుగుపెట్టే క్రమంలో ఫోటోషూట్ల పరంగా మరింత దూకుడు పెంచింది. ఓవైపు హాట్ కంటెంట్ ని తనదైన శైలిలో ప్రెజెంట్ చేస్తూనే ట్రెడిషనల్ అవతార్ లో కనిపించేందుకు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇటీవల సౌత్ అభిమానులను దృష్టిలో ఉంచుకుని ఫోటోషూట్ల తీరుతెన్నులను మార్చేయడం గమనార్హం. కొద్ది కాలంగా జాన్వీ కపూర్ వరుస ఫోటోషూట్లు అంతర్జాలంలో సునామీని సృష్టిస్తున్నాయి. తాజాగా ఈ బ్యూటీ బంగారు తళుకుల ఫ్రాకులో ఎంతో అందంగా కనిపిస్తోంది. లేటెస్ట్ డిజైనర్ థై స్లిట్ ఫ్రాక్ లో జాన్వీ మునుపటి కంటే హాట్ గా కనిపిస్తోందంటూ అభిమానులు కితాబిచ్చేస్తున్నారు. ముఖ్యంగా తారక్ అభిమానులు జాన్వీ కపూర్ ఫోటోలను వైరల్ గా షేర్ చేస్తూ యువరాణి అంటూ తమ ప్రేమను కురిపిస్తున్నారు. ఆర్.ఆర్.ఆర్ లాంటి పాన్ ఇండియా హిట్ అందుకున్న తర్వాత యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన అవకాశం దక్కించుకున్న జాన్వీ నిజంగా అదృష్టవంతురాలు అంటూ కీర్తించేస్తున్నారు. బంగారు వర్ణం లాంగ్ ఫ్రాక్ లో జాన్వీ తళుకుబెళుకులు గుండెల్ని గుల్ల చేస్తున్నాయంటూ ఒక సెక్షన్ ఫ్యాన్స్ ప్రేమలో పడిపోయారు. ఓవరాల్ గా జాన్వీ గోల్డెన్ లుక్ ఫ్యాన్స్ గుండెల్లో బలమైన ముద్ర వేసిందనడంలో సందేహం లేదు. యంగ్ టైగర్ ఎన్టీఆర్ తన కెరీర్ 30వ సినిమాతో ల్యాండ్ మార్క్ హిట్ అందుకోవాలని తపిస్తున్నాడు. కొరటాల శివ దర్శకుడు కావడంతో ఈ మూవీ కోసం పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగుతున్నాడు. ఇలాంటి క్రేజీ ప్రాజెక్ట్ లో జాన్వీ కథానాయికగా అవకాశం అందుకుంది. ఈ సినిమాతో జాన్వీ పేరు దేశ విదేశాల్లో మార్మోగడం ఖాయమని విశ్లేషిస్తున్నారు. సరైన టైమ్ లో సరైన ప్రాజెక్ట్ తో జాన్వీ సౌత్ లో అడుగుపెడుతుండడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. జాన్వీ ఇటీవల ఎన్టీఆర్ 30 లాంచ్ ఈవెంట్ లో మాట్లాడుతూ.. ఎన్టీఆర్ సరసన నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని... టీమ్ సృష్టిస్తున్న ప్రపంచం ప్రేక్షకులను చాలా ఎగ్జయిట్ చేస్తుందని కితాబిచ్చింది. ఇటీవలే RRR సినిమాని మళ్లీ చూశానని అపారమైన చరిష్మా ఉన్న ఎన్టీఆర్ తో కలిసి నటించడం గొప్ప అవకాశమని దీనిని సద్వినియోగం చేసుకుంటానని జాన్వీ పేర్కొంది.

## హీరోలకు ధీటుగా 5కోట్లు చెల్లిస్తున్నారా?

కొందరికి అవకాశాలతో పాటు అదృష్టం కూడా ఇట్టే కలిసొచ్చేస్తుంది. అలాంటి అరుదైన కథానాయికల్లో ముంబై బ్యూటీ కియరా అద్వాణీ.. కన్నడ బ్యూటీ రష్మిక మందన్న ఉన్నారు. బుట్టబొమ్మ పూజా హెగ్డే నటిగా ఎదిగేందుకు చాలా సమయం తీసుకున్నా కానీ ఇటీవల ఈ బ్యూటీ స్టార్ డమ్ ఓ వెలుగు వెలుగుతోంది. ఆ తర్వాత టాలీవుడ్ లో వేగంగా దూసుకుపోయే ఛాన్స్ వేరే ఏ కథానాయికకు ఉంది? అంటే దీనికి సమాధానం దొరికింది. తాజా సమాచారం మేరకు ఇలా ఎన్టీఆర్ సరసన అడుగు పెడుతోందో లేదో ఇప్పటికే జాన్వీకపూర్ పై టాలీవుడ్ అగ్ర హీరోల కన్ను పడింది. నిజానికి రామ్ చరణ్ .. అల్లు అర్జున్ లేదా మహేష్ లాంటి స్టార్ హీరోల సరసన జాన్వీ కి నటించే అవకాశం వచ్చిందని ఇంతకుముందు




పుకార్లు వచ్చాయి. కానీ అవేవీ నిజాలు కావని ఆ తర్వాత ప్రూవైంది. ఇటీవలే NTR 30 టీమ్ లో చేరింది ఈ బ్యూటీ. తారక్ హీరో గా కొరటాల శివ తదుపరి చిత్రంలో జాన్వీ కపూర్ ని ఎంచుకున్నాడు. ఇప్పుడు చరణ్- మహేష్ లాంటి స్టార్ హీరోల సరసనా జాన్వీ కి అవకాశాలొస్తున్నాయని గుసగుస వినిపిస్తోంది.

మొన్నటికి మొన్న ఉప్పెన ఫేం బుచ్చిబాబు సనా దర్శకత్వంలో నటించేందుకు చరణ్ తో ప్లాన్ చేస్తున్నాడని. ఈ సినిమా కోసం జాన్వీ కి స్క్రిప్ట్ చెప్పడానికి సమయం తీసుకున్నట్లు చెబుతున్నారు. అలాగే రాజమౌళి బృందం కూడా మహేష్ బాబు ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న భారీ చిత్రం కోసం హీరోయిన్ల కోసం వెతకడం ప్రారంభించారని కథనాలొస్తున్నాయి. ఈ ఇద్దరు హీరోల్లో ఎవరికి ఓకే చెప్పిందో జాన్వీనే చెప్పాల్సి ఉంది. ఒక్కో సినిమాకి టాలీవుడ్ యువహీరోలను మించి పారితోషికం అందుకుంటూ జాన్వీ కపూర్ ఆశ్చర్యపరుస్తోంది. ఈ భామ ఒక్కో కమిట్ మెంట్ కి సుమారు 5 కోట్లు డిమాండ్ చేస్తోందని తెలిసింది.

## ఒకే ఆకాశంలో నిండైన రెండు చందమామలు

ఒకే ఆకాశంలో రెండు చందమామలను ఎప్పుడైనా చూశారా? అయితే అలాంటి అరుదైన దృశ్యం ఇక్కడ సర్ ప్రైజ్ చేస్తోంది. ఒకటే ఫ్రేమ్.. కానీ రెండు చంద్ర బింబాలు మతులు చెడగొడుతున్నాయి. ఇంతకీ ఎక్కడి నుంచి పుట్టుకొచ్చారు నిండైన ఆ ఇద్దరు చందమామలు.. అంటే వివరాల్లోకి వెళ్లాలి. చందమామ అనగానే తెలుగు ప్రజలు ఇట్టే గుర్తు పట్టేస్తారు. ది గ్రేట్ కాజల్ అగర్వాల్ అని వెంటనే అభిమానులు తడుము కోకుండా చెప్పేస్తారు. ఇక చందమామ కాజల్ కెరీర్ అత్యుత్తమ దశలో ఉన్న క్రమంలోనే తన సోదరి నిషా అగర్వాల్ ని కూడా సినీరంగంలోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే.నిషా కొన్ని విజయవంతమైన చిత్రాల్లో నటించినా కానీ ఎందుకనో కెరీర్ పరంగా కాజల్ స్థాయిని అందుకోలేకపోయింది. కాజల్ అంత వైబ్రేంట్ కెరీర్ రన్ ని సాగించడంలో తడబడింది. ఇక




అవకాశాలు తగ్గే క్రమంలోనే పెళ్లి చేసుకుని లైఫ్ లో సెటిలైంది. నిషా వారసులను తన పెళ్లికి ముందు కాజల్ ఆటలాడిస్తూ.. సోదరి బిడ్డను తన బిడ్డగా మురిపెంగా చూసుకునేది. కానీ ఇప్పుడు తనకు కూడా పెళ్లయి ఒక బిడ్డకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. కాజల్- గౌతమ్ కిచ్లు జంటకు ఇటీవల బేబి బోయ్ జన్మించగా నీల్ అని నామకరణం చేసారు. ఇక ఇదంతా చందమామ సిస్టర్స్ గత హిస్టరీ అనుకుంటే.. వర్తమానంలో కాజల్- నిషా అగర్వాల్ లేటెస్ట్ ఫోటోషూట్ తో మతులు చెడగొడుతున్నారు. ఒకే ఫ్రేమ్ లో నిండైన రెండు చందమామలు వచ్చి చేరాయా? అన్నంత అందంగా ఈ ఫోటోషూట్ కుదిరింది. పాపులర్ ఆజా ఫ్యాషన్ మ్యాగజైన్ కోసం ఫోటోషూట్ ఇది. “సచ్ ఏ ఫన్ షూట్ విత్ మై ఫ్యాబ్యులస్ సిస్టర్!” అన్న లవ్ లీ క్యాప్షన్ తో కాజల్ అగర్వాల్ స్వయంగా ఈ ఫోటోలను ఇన్ స్టాలో షేర్ చేయగా అవి వైరల్ గా మారాయి. రకరకాల డిజైనర్ దుస్తుల్లో సిస్టర్స్ ఫోజులు యువతరం వాట్సాపుల్లో సోషల్ మీడియాల్లో జోరుగా షికార్ చేస్తున్నాయి. కాజల్ ఇటీవల కంబ్యాక్ విషయంలో సీరియస్ గా ఉంది. వరుసగా అగ్ర హీరోల సినిమాలకు సంతకాలు చేస్తున్న సంగతి తెలిసిందే. నటసింహా నందమూరి బాలకృష్ణ సరసన తొలిసారి తన కెరీర్ లో నటిస్తోంది. తదుపరి టాలీవుడ్ అగ్ర హీరోల సినిమాల్లో నటించేందుకు తహతహలాడుతోంది. అలాగే పెళ్లికి ముందు పలు భారీ క్రేజీ సినిమాల్లో ఆఫర్లు వచ్చినా కాజల్ తిరస్కరించిన సంగతి తెలిసిందే.




# మహానగరానికి మణిహారం ట్యాంక్‌బండ్..!

## పరిశుభ్రత పాటించాలని కేటీఆర్ విజ్ఞప్తి

హైదరాబాద్ మహా నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో, పట్టణాభివృద్ధి, మున్సిపాలిటీ శాఖల మంత్రి కేటీఆర్ పర్యవేక్షణలో ప్రభుత్వ యంత్రాంగం విరామం లేకుండా శ్రమిస్తోంది. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా హైదరాబాద్‌లోని పర్యాటక ప్రాంతాలను సుందరీకరిస్తున్నారు. అందులో భాగంగా మహానగరానికి మణిహారంగా మారిన ట్యాంక్‌బండ్‌ను అద్భుతంగా తీర్చిదిద్దారు. దీంతో సాయంత్రం వేళ, సెలవు దినాల్లో ట్యాంక్ బండ్‌కు పర్యాటకులు పోటెత్తుతున్నారు. అయితే ట్యాంక్‌బండ్‌ను పర్యాటకులు అపరిశుభ్రంగా తయారు చేస్తున్నారు. రాత్రి వేళల్లో తినుబండారాలకు సంబంధిత పదార్థాలను, కేకులను ఇతరత్రా వ్యర్థాలను ట్యాంక్‌బండ్‌పై పడేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారడమే కాకుండా, మార్నింగ్ వేళ వచ్చే ప్రకృతి ప్రేమికులకు, వాకర్స్‌కు కాస్త ఇబ్బందిని కలిగిస్తోంది. ఈ విషయం ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి రావడంతో.. రాష్ట్ర పట్టణాభివృద్ధి, మున్సిపాలిటీ శాఖల మంత్రి కేటీఆర్ తన ట్విట్టర్ ఖాతాలో ఓ వీడియోను విడుదల చేస్తూ.. సందేశమిచ్చారు. మహానగరానికి మణిహారం ట్యాంక్‌బండ్! శతాబ్దాల ఘన చరిత్రకు ప్రతీక ట్యాంక్‌బండ్. అందుకు తగ్గట్టే% ట్యాంక్‌బండ్ సుందరీకరణను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని, ఈ విశిష్ట నిర్మాణానికి మరిన్ని మెరుగులు అద్ది% ట్యాంక్‌బండ్‌ను అత్యంత అందంగా తీర్చిదిద్దింది తెలంగాణ ప్రభుత్వం అని కేటీఆర్ పేర్కొన్నారు. నగర ప్రజలకు, పర్యాటకులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని అందిస్తూ, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుతున్న ట్యాంక్‌బండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడటం మనందరి బాధ్యత అని సూచించారు. మనం నివసించే ఇంటిలాగానే మనకు గర్వకారణం అయిన పర్యాటక ప్రదేశాల్లో కూడా పరిశుభ్రతను పాటించాలని ప్రజలందరికి విజ్ఞప్తి చేస్తున్నాను అని కేటీఆర్ తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

# లోక్‌సభ డిలిమిటేషన్‌లో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం: మంత్రి కేటీఆర్



హైదరాబాద్: 2026వ సంవత్సరం తర్వాత జనాభా ప్రతిపాదికన జరుగనున్న లోక్‌సభ స్థానాల డిలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని మంత్రి కే తారక రామారావు అన్నారు. అధిక జనాభాతో సతమతమవుతున్న దేశాన్ని కాపాడుకునేందుకు జనాభా నియంత్రణ పద్ధతులు పాటించాలని దశాబ్దాల నుంచి కేంద్రం చెబుతున్న మాటలను, విధానాలను నమ్మి ప్రగతిశీల విధానాలతో జనాభా నియంత్రణ చేసిన దక్షిణాది రాష్ట్రాలు ఈరోజు తీవ్ర అన్యాయానికి లోనయ్యే అవకాశం ఉందన్నారు. ప్రగతిశీల విధానాలతో ముందుకు పోతున్న దక్షిణాది రాష్ట్రాలు ఈ నూతన డిలిమిటేషన్ వల్ల తక్కువ లోక్‌సభ స్థానాలు పొందడం అన్యాయం, బాధాకరమని ట్విట్టర్ వేదికగా తెలిపారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వ విజ్ఞప్తులను పట్టించుకోకుండా జనాభా నియంత్రణ చేయని రాష్ట్రాలు, ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలు లోక్‌సభ సీట్ల పెంపులో లబ్ధిపొందుతున్నాయని.. ఇది దురదృష్టకరమన్నారు. జనాభాను నియంత్రించిన కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు తమ ప్రగతిశీల విధానాలకు తీవ్రంగా శిక్షించబడుతున్నాయని మంత్రి కేటీఆర్ వెల్లడించారు. కేవలం జనాభా నియంత్రణ మాత్రమే కాకుండా అన్ని రకాల మానవాభివృద్ధి సూచీల్లోనూ దక్షిణాది రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని చెప్పారు. కేవలం 18 శాతం జనాభా కలిగిన దక్షిణాది రాష్ట్రాలు 35 శాతం జాతీయ స్థూల జాతీయోత్పత్తికి నిధులు అందిస్తున్నాయని తెలిపారు. జాతీయ ఆర్థిక అభివృద్ధికి, దేశ అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తున్న దక్షిణాది రాష్ట్రాలు అసంబద్ధమైన లోక్‌సభ డిలిమిటేషన్ విధానం వల్ల భవిష్యత్తులో తమ ప్రాధాన్యత కోల్పోరాదని చెప్పారు. తమ ప్రగతిశీల విధానాలకు లబ్ధిపొందాల్సిన చోట తీవ్రమైన అన్యాయానికి గురవుతున్న దక్షిణాది రాష్ట్రాల వాణిని వినిపించాల్సిన అవసరం ఉన్నదని, ఈ విషయంలో రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న అన్యాయంపైన నాయకులు, ప్రజలు గళమెత్తాలని మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు.




# ఈటల నన్ను బీజేపీలోకి రమ్మన్నారు...

హైదరాబాద్: ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తనను బీజేపీలోకి ఆహ్వానించారని.. అయితే మళ్ళీ కలిసి ఉద్యమం చేద్దాం తనతో కలిసి రమ్మని ఈటలకి చెప్పానని జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామాలకు బీఆర్ఎస్ నాయకులు వస్తే నిలదీయాలన్నారు. పార్టీ పెడతానని తానెప్పుడూ అనలేదన్నారు. అందరం కలిసి ఒకేదారిలో వెళ్దామని చెబుతున్నానన్నారు. తన లక్ష్యం కేసీఆర్‌ను ఓడించడమేనని, దానికి ఏది సరైన మార్గమని అనిపిస్తే ఆదారిలో వెళ్తానన్నారు. తాను తెలంగాణ కోసం రాజీనామా చేసిన వ్యక్తినని జూపల్లి కృష్ణారావు అన్నారు. రెండు ఉద్యమాలు చేసి విజయం సాధించానని, ఇప్పుడు కూడా గెలుపు తనదేనని విశ్వాసం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ సరిగ్గా ఉంటే తాను ఇలా చేసేవాడిని కాదన్నారు. వ్యక్తుల సమూహమే రాజకీయ పార్టీ అని, సమయం పట్టచ్చు... కానీ అందరినీ ఒకే బాటలో నడిపిస్తానన్నారు. జూన్‌లో ఏదో ఒక రోజు తన నిర్ణయం చెబుతానని జూపల్లి కృష్ణారావు చెప్పారు.

# విద్యుత్ కొరత నుంచి త్వరలో మిగులుకు చేరుకోబోతున్నాం : టీఎస్ జెన్‌కో చైర్మన్

జయశంకర్ భూపాలపల్లి : ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యుత్ రంగానికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల రాష్ట్రం విద్యుత్ కొరత నుంచి మిగులుకు చేరుకోబోతుందని టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ దేవులపల్లి ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో రూ కోటి వ్యయంతో నూతనంగా నిర్మించిన పర్యవేక్షక ఇంజనీర్ ఆపరేషన్ సర్కిల్ (విద్యుత్ ప్రగతి భవన్) భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడే నాటికి కరెంట్ వినియోగం సగటున 1136 యూనిట్లు కాగా నేడు 2140 యూనిట్లకు చేరుకుందని వివరించారు. రాష్ట్రం ఏర్పడక ముందు రైతాంగం అనేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. పగలుమూడు గంటలు, రాత్రి మూడు గంటల కరెంట్ వల్ల రైతులు పొలాలవద్దే పడుకునేవారని , పాము, తేళ్ల కాటుకు, కరెంటు ప్రమాదాలకు లోనయ్యేవారని వివరించారు. అప్పటి పరస్థితి నేడు లేదని, అందరికీ నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో హైదరాబాద్‌లో అందిస్తున్న మాదిరిగా నాణ్యమైన విద్యుత్‌ను మారుమూల ప్రాంతాలకు కూడా ఇస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత నాణ్యమైన విద్యుత్ ఇవ్వడానికి కరెంట్ జనరేషన్, డిస్ట్రిబూషన్, ట్రాన్స్‌మిషన్లపై రూ. 97,500 కోట్లు పెట్టుబడి పెట్టిందని తెలిపారు. ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబూషన్ నెట్‌వర్క్ కోసం 40 వేల కోట్లు వెచ్చించడడం వల్ల నాణ్యమైన విద్యుత్‌ను అందించగలుగుతున్నామని పేర్కొన్నారు. భూపాలపల్లి సెకండ్ స్టేజ్ కింద 600 మెగావాట్ల ప్రాజెక్టును చేపట్టి ఏడాదిలోపు పూర్తి చేసి సీఎం కేసీఆర్ జాతికి అంకితం చేశారని గుర్తు చేశారు. రాష్ట్రం వచ్చేనాటికి 7778 మెగావాట్ల కెపాసిటీ ఉండగా నేడు 18,565 మెగావాట్ల కెపాసిటీ వరకు పెంచామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అవసరమయ్యే విద్యుత్ ఇచ్చే స్థితిలో ఉన్నామని తెలిపారు. వీటితో పాటు పాలమూరు,రంగారెడ్డి ఎత్తిపోతలకు అవసరమయ్యే 6500 మెగావాట్ల విద్యుత్ అవసరముంటుందని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ దూరదృష్టితో మిర్యాల గూడ దామరచర్ల వద్ద 4వేల మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ ఉత్పత్తికి రూ. 34 వేల కోట్లతో చేపట్టామని త్వరలో దాన్నికూడ ప్రారంభించబోతున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎన్పీడీసీఎల్ సీఎండి అన్నమనేని గోపాల్ రావు, జెన్కో,ట్రాన్స్‌కో డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో సీఎండీ మొక్కను నాటారు .




హైదరాబాద్: నగర శివారు పెద్ద అంబర్‌పేట్‌లో యువకుడి మృతదేహం లభ్యమైన ఘటనపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. పెద్ద అంబర్‌పేట్ డాక్టర్స్ కాలనీ సమీపంలో కుళ్లిపోయిన స్థితిలో యువకుడు రాజేశ్ మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించిన విషయం తెలిసిందే. ఈ కేసులో కీలక అంశాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయురాలితో వివాహేతర సంబంధం కారణంగా ఆమె భర్త నాగేశ్వరరావే రాజేశ్‌ను హత్య చేసినట్లు భావిస్తున్నారు. టీచర్ భర్తతో పాటు మరికొంతమంది బంధువులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రాజేశ్ హత్య కేసుతో తనకు సంబంధం లేదని ప్రభుత్వ టీచర్ భర్త నాగేశ్వరరావు చెబుతున్నారు. అతడిపై దాడి చేశామన్న వార్తల్లో వాస్తవం లేదన్నారు. అసలు రాజేశ్ ఎవరో తమకు తెలియదని.. తన భార్యను ఎవరో బ్లాక్ మెయిల్ చేసి భయపెట్టారని చెప్పారు. ఆమెకు రాజేశ్‌తో సోషల్ మీడియాలో పరిచయం జరిగి ఉండొచ్చని.. వాళ్లిద్దరికీ వయసులోనూ చాలా వ్యత్యాసం ఉందన్నారు. తన భార్య మృతిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టాలని నాగేశ్వరరావు కోరారు.

**నేపథ్యమిదీ..** హయత్‌నగర్‌కు చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలితో రాజేశ్‌కు కొంతకాలంగా ఏర్పడిన పరిచయం కాస్తా వివాహేతర సంబంధానికి దారితీసింది. వీరిద్దరి బంధం గురించి భర్తకు తెలియడంతో ఆమెను పలుమార్లు మందలించారు. మనస్తాపానికి గురైన ఆమె.. తాను చనిపోతానంటూ రాజేష్‌తో జరిపిన వాట్సప్ చాటింగ్‌లో చెప్పింది. అలా చేయొద్దని.. తానూ చనిపోతానని రాజేశ్ చెప్పినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఈనెల 24న పురుగుల మందు తాగి టీచర్ ఆత్మహత్యాయత్నం చేసింది. అనంతరం ఆమెను నగరంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కాగా ఈనెల 24 నుంచీ రాజేశ్ సదరు మహిళ ఇంటి చుట్టూ తిరుగుతుండగా.. ఆమె కుమారుడు గమనించాడు. తన స్నేహితులతో కలిసి ఈనెల 26న రాజేశ్‌ను పట్టుకొని నిలదీసి.. అతడి సెల్‌ఫోన్ పరిశీలించగా అసలు విషయం తెలిసింది. దీంతో వారు రాజేశ్‌ను కొట్టి హెచ్చరించి వదిలేసినట్లు తెలిసింది.




హైదరాబాద్: ఐటీ అధికారులమంటూ సికింద్రాబాద్ పాట్ మార్కెట్‌లోని బాలాజీ జ్యూవెల్లర్స్‌లో పట్ట పగలు దోపిడీకి పాల్పడిన కేసును పోలీసులు ఛేదించారు.

చోరీకి పాల్పడిన అంతరాష్ట్ర ముఠాలోని నలుగురు నిందితులను అదుపులోకి తీసుకన్న పోలీసులు వారి నుంచి ఏడు బంగారం బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ మీడియాకు వెల్లడించారు. "ఈనెల 27వ తేదీ ఉదయం రద్దీగా ఉండే సికింద్రాబాద్ పాట్ మార్కెట్‌లోని బాలాజీ జ్యూవెలర్స్‌కు ఆరుగురు నిందితులు వచ్చి ఐటీ అధికారులమంటూ సిబ్బందిని ఓ గదిలో బంధించారు. తనిఖీల పేరుతో కారా?నాలో ఉన్న 17 బంగారం బిస్కెట్లను స్వాధీనం చేసుకుని ఉడాయించారు. నిందితులు ఎలాంటి ఆధారాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో కేసు దర్యాప్తు పోలీసులకు సవాల్‌గా మారింది. మొత్తం సిబ్బందిని అదుపులోకి తీసుకుని విచారించగా.. ఆభరణాల దుకాణంలో పనిచేసే వ్యక్తి ఇచ్చిన సమాచారంతో దొంగలు నగరం చేరినట్లు అంచనాకు వచ్చారు. రంజాన్ తర్వాత ఖానాపూర్‌కు చెందిన జాకీర్ అనే వ్యక్తి పనిలో చేరాడు. అతడు ఇచ్చిన సమాచారంతో చోరీకి ఈ ముఠా ప్లాన్ చేసింది. జాకీర్ నుంచి వివరాలు సేకరించిన పోలీసులు.. మహారాష్ట్రలోని ఖానాపూర్ వెళ్లి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఏడు బంగారు బిస్కెట్లు స్వాధీనం చేసుకున్నారు. మరో ఆరుగురు నిందితులను అరెస్టు చేసి, 10 బంగారం బిస్కెట్లు స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. నిందితుల కోసం మహారాష్ట్రలో ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. సూర్య నటించిన ' గ్యాంగ్ ' , అక్షయ్ కుమార్ నటించిన 'స్పెషల్ 26' సినిమాలు చూసి చోరికి పథకం వేసినట్టు నిందితులు విచారణలో వెల్లడించారు" అని సైబరాబాద్ సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు.

# తెలంగాణలో మరో మూడు రోజులు వానలు..!



తెలంగాణలో రాగల మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షాలు పడుతాయని పేర్కొంది. నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది. నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మిగతా చోట్ల ఉరుములు, మెరుపులతో తేలికపాటి వానలు పడుతాయని చెప్పింది. బుధవారం నుంచి గురువారం వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే సూచనలున్నాయని, ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం కురిసే అవకాశాలున్నాయంటూ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఇదిలా ఉండగా.. మంగళవారం పెద్దపల్లి, మహబూబాబాద్, ఖమ్మం, నాగర్ కర్నూల్, నల్గొండ జిల్లాల్లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా నల్గొండ జిల్లా గుర్రంపోడులో 73.8 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైంది.



నిజామాబాద్ జిల్లా మక్లూర్‌లో భారాస ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మంత్రి మల్లారెడ్డి, కవిత హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు.

# గ్రంథాలయాలకు పూర్వవైభవం : మంత్రి తలసాని

గత ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురైన గ్రంథాలయాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి పూర్వవైభవం తీసుకువస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని షేక్‌పేటలో రూ.60లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న గ్రంథాలయ భవన పనులను స్థానిక ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలకు ఎంతో ఘనత చరిత్ర ఉందన్నారు. విజ్ఞాన భాండాగారాలుగా విలసిల్లిన గ్రంథాలయాల నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయించకపోవడం, సౌకర్యాలు, వసతుల గురించి పట్టించుకోని కారణంగా గ్రంథాలయాలకు వచ్చే వారి సంఖ్య తగ్గిపోయిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు నగరంలో ఉన్న గ్రంథాలయాల్లో అన్ని సౌకర్యాలు, వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన మరమ్మతులు చేపట్టడం, శిథిలావస్థలో ఉన్న, అద్దె భవనాల్లో కొనసాగుతున్న 14 గ్రంథాలయాలకు రూ.9.40 కోట్ల వ్యయంతో నూతన భవనాలను నిర్మిస్తున్నట్లు వివరించారు. ప్రధాన లైబ్రరీల్లో ప్రభుత్వం నిర్వహించే పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు స్టడీ మెటీరియల్‌ను సైతం అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. గ్రంథాలయాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేస్తూ వస్తుందని తెలిపారు. ఈ గ్రంథాలయాలు పరిసరాల ప్రాంత ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలు సంతోషంగా ఉండాలనే ఆలోచనతో ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రసన్న, కార్యదర్శి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com